

0933520440
09305978486
09794359502
PRAYAG TEERTH PUROHIT
KRISHNA SHASTRI
AND HIS SON
ORGD : BY BHAIYAN SHASTRI (BABU GARU)
32, Daragani Near Police station PRAYAGARAJ.
GANGARAM PRABHAULALJI & SONS



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com


# విశాఖ సమాచారమ్


Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.



RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 273 విశాఖపట్నం, 16 ఆగస్టు 2023 బుధవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00


## పేదలు గెలిచే వరకూ, వారి బతుకులు బాగుపడే వరకూ యుద్ధం: సీఎం

**విజయవాడ:** మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా తీసుకొని అన్ని హామీలను అమలు చేశామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు 68 శాతం మంత్రి పదవులు కల్పించినట్లు వెల్లడించారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ జెండాను ఎగురవేసిన సీఎం జగన్. అనంతరం ప్రసంగించారు. శాసన సభ స్పీకర్‌గా బీసీ, శాసన మండలి చైర్మన్‌గా ఎస్సీని నియమించినట్లు చెప్పారు. 139 బీసీ కులాలకు 56 ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం నవరత్నాల పాలన**



ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం నవరత్నాల పాలన అని సీఎం జగన్ పేర్కొన్నారు. 99.05శాతం హామీలను అమలు చేశామని తెలిపారు. 50 నెలల్లో డీబీటీ ద్వారా రూ. 2.31 లక్షల కోట్ల లబ్ధి చేరుకగా.. 2 లక్షల 6 వేల 638 శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. పంట నష్టపోతే ఆ సీజన్‌లో పరిహారం అందిస్తున్నామన్నారు. ఆక్వా జోన్లలో ఉన్న రైతులకు రూపాయిన్నరకే విద్యుత్ ఇస్తున్నమని చెప్పారు. పాల రైతుల కోసం పాల వెల్లువ కార్యక్రమం తీసుకొచ్చామని.. పాల ధర లీటర్‌కు రూ. 10 నుంచి రూ. 22 వరకు పెంచినట్లు తెలిపారు.

రాష్ట్రంలో కొత్తగా 4 పోర్టుల నిర్మాణం ప్రారంభమైనట్లు సీఎం తెలిపారు. భోగాపురం అంతార్జాతీయ విమానాశ్రయ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్

(మిగతా 2లో)

## ఎర్రకోట సాక్షిగా మోడీ వరాల జల్లులు



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ.. ఎర్రకోట సాక్షిగా దేశ ప్రజలపై వరాల జల్లులు కురిపించారు. ఈ సందర్భంగా పలు కీలక పథకాలు తెరపైకి తెచ్చారు. మరి ముఖ్యంగా మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారమే లక్ష్యంగా కొత్త పథకం రాబోతోందని తెలిపారు.

అవును... పట్టణ ప్రాంతాల్లో దిగువ, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారమే లక్ష్యంగా నూతన పథకాన్ని తీసుకొస్తున్నట్లు మోడీ ప్రకటించారు. బ్యాంకు రుణాలపై రాయితీ ఇచ్చేలా కొత్త పథకానికి శ్రీకారం చుడుతున్నట్లు వెల్లడించారు. దీనివల్ల రూ.లక్షల్లో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

ఇదే సమయంలో చౌక ధరల్లో లభించే జనరిక్ మందులు అందరికీ అందుబాటులో ఉండేందుకు వీలుగా జన ఔషధి కేంద్రాల సంఖ్యను 10వేల నుంచి 25వేలకు పెంచుతున్నట్లు ప్రధాని మోడీ ప్రకటించారు. మార్కెట్ లో రూ.100కు దొరికే మందులు.. జన ఔషధి కేంద్రాల్లో రూ.10-15కే లభిస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా 2024 ఎన్నికల్లో విజయంపై ధీమా వ్యక్తం చేసిన మోడీ... "మీరు మళ్లీ నన్ను ఆశీర్వదిస్తే.. వచ్చే ఏడాది ఆగస్టు 15న మళ్లీ వస్తా.

(మిగతా 2లో)

## గోద్రా రైలు దహనం కేసు దోషులకు బెయిల్ నిరాకరించిన సుప్రీంకోర్టు



గోద్రా రైలు దహనం కేసు దోషులకు బెయిలు ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. మత కల్లోలాలకు కారణమైన 2002లో జరిగిన రైలు దహనం కేసును న్యాయస్థానం 'తీవ్రమైన ఘటన'గా పేర్కొంది. ఈ ఘటనలో దోషులు ముగ్గురు క్రియాశీల పాత్ర పోషించినట్టు తెలిపింది. దోషులు సౌకత్ యూసుఫ్ ఇస్మాయిల్, బిలాల్ అబ్దుల్లా ఇస్మాయిల్, సిద్ధికరేలు ఈ కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్నారు.

రైలు దహనం ఘటన చాలా తీవ్రమైనదని, ఇది ఒంటరి వ్యక్తి హత్యకు సంబంధించినది కాదని ప్రధాన

(మిగతా 2లో)

## బ్రహ్మాకుమారి సభ్యులచే పతాకావిష్కరణ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగరంలోని హెచ్‌బీకోలనీలో గల బ్రహ్మమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ సభ్యులచే మంగళవారం ఉదయం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ సమాచారమ్ సంపాదకులు సూరంపూడి వీరభద్రరావు పాల్గొని పతాకావిష్కరణ గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వివిధ రంగాలలో అశాంతి నెలకొని ఉందని, స్థిమితమైన మానసిక శక్తిని పెంపొందించుకునేందుకు బ్రహ్మకుమారి సోదరీమణులు తమ కార్యకలాపాలను విస్తృతం చేసి ఎక్కువమందికి ధ్యానం చేసుకునే విధానాలను నేర్పించాలని కోరారు.

స్వల్పకాలం ప్రతీరోజు ధ్యానం చేయడం ద్వారా ప్రతీ ఒక్కరూ తమనుతాము నియంత్రించుకోగలుగుతారని, తద్వారా ఉత్తతమైన పనితనాన్ని సంతరించుకోగలుగుతారని, ఫలితంగా వారు తమతమ రంగాలలో సునాయాశంగా విజయం సాధిస్తారని అన్నారు. బ్రహ్మకుమారి రామేశ్వరి స్వాగతం పలుకగా ఆమ్ ఆద్మీ పార్టీ స్థానిక నాయకులు సీతల్, రొటేరియన్ మొల్లేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టాలెంట్ స్కూల్‌లో పతాకావిష్కరణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సాగర్‌నగర్‌లోని టాలెంట్ టచ్ టెక్నో స్కూల్‌లో పతాకావిష్కరణ జరిపి జాతీయగీతం ఆలపించారు. కార్యక్రమానికి జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ అప్పారావు ముఖ్య అతిథిగా హాజరై బాలలకు, వారి తల్లిదండ్రులకు స్వాతంత్ర్యం గురించి, స్వాతంత్ర్య పోరాటం గురించి వివరించారు. డైరెక్టర్ రాంబాబు పిల్లలను, వారి వివిధ ఆకర్షణీయ దుస్తుల ప్రదర్శనను అభినందించారు. విద్యార్థులు వివిధ రకాల నృత్యాలు ప్రదర్శించారు. కొందరు విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల మాదిరిగాను, సైనికుల మాదిరిగాను, భరతమాత రూపంలోను అలంకరించుకొని సభికుల ప్రశంసలు పొందారు. వారిలో స్ఫూర్తిని నింపేలా, వారికి అవగాహన కలిగేలా ప్రిన్సిపాల్ శ్రీదేవి చక్కటి విషయాలు తెలియజేశారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బాలబాలికలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు అతిథుల ద్వారా బహుమతి ప్రదానం చేశారు. పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది ఎంతో కష్టపడి ప్రాంగణాన్ని ఆకర్షణీయంగా అలంకరించారు. అతిథులను గౌరవంగా ఆహ్వానించి సత్కరించారు.

## సత్ప్రవర్తనే ఉజ్వల భవిష్యత్తుకు మూలం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మంచి ప్రవర్తన ద్వారానే బాలలు, యువతరం ఉజ్వల భవిష్యత్తును ఏర్పాటు చేసుకోగలరని, ఆవేశం, తొందరపాటు వారి జీవితాలలో మాయనిమచ్చగా మిగిలిపోతాయని విశాఖ బాలుర జువైనల్‌హోమ్ సూపరింటెండెంట్ వీరయ్య అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జువైనల్‌హోమ్‌లో పతాకావిష్కరణ అనంతరం జరిగిన సమావేశంలో అక్కడ నివసిస్తున్న నేరారోప బాలురను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ చిన్న వయస్సులో ఆవేశకావేశాలతో తొందరపడి నేరాలు చేసి, ఇతరులకు కష్టనష్టాలు కలిగించి, సత్ప్రవర్తన కొరకు వారంతా ఇక్కడ ఉంచబడ్డారని, వారు తమ తప్పులను తెలుసుకొని పశ్చాత్తాపపడి, తమనుతాము ఆత్మశోధన చేసుకొని మంచిపౌరులుగా మారాలని హితబోధ చేశారు. అనంతరం వారిచే దేశభక్తి గీతం ఆలపింపజేశారు.

జువైనల్‌హోమ్ న్యాయవిభాగ అధికారిణి సునీత, బ్రహ్మకుమారి రామేశ్వరి సంయుక్తంగా పతాకావిష్కరణ గావించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ బాలలు జరిగిన దానిని



గుర్తుకు తెచ్చుకొని మళ్లీ అటువంటి పొరపాట్లు చేయకుండా తమను తాము నియంత్రించుకునేలా మానసిక శక్తిని పెంపొందించుకోవాలని, దేశం కోసం, సమాజం కోసం సేవకులుగా తమను తాము తయారు చేసుకునేందుకు మానసిక సంఘర్షణ చేపట్టాలని అప్పుడే వారిలో ఉత్తమమైన భావాలు, ఆలోచనలు కలుగుతాయని అన్నారు. బ్రహ్మకుమారి రామేశ్వరి

(మిగతా 2లో)

## పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఉదయం 09:02 గంటలకు జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు మరియు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి విడదల రజని జాతీయ పతాకావిష్కరణ చేసి, జాతీయ గీతాలాపన చేసారు. అనంతరం సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రగతిని గూర్చి మంత్రి ప్రసంగించారు. తదుపరి వివిధ ప్రభుత్వ శాఖలు రూపొందించిన 11 శకటాలను ప్రదర్శించారు. అదే విధంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన 16 స్టాల్స్ ను మంత్రి పరిశీలించారు.

జిల్లాలో ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన శకటాలలో జి.వి.ఎం .సి శకటానికి మొదటి బహుమతి, విద్యా శాఖ శకటం రెండవబహుమతి , డి.ఆర్.డి.ఎ. మరియు వి.ఎం .ఆర్. డి.ఎ శకటాలు మూడవ బహుమతిని సాధించాయి . పశుసంవర్ధక శాఖ శకటం కన్సోలేషన్ బహుమతి పొందింది.

సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా గాజువాక జిల్లా పరిషత్ హైస్కూలు 60 మంది విద్యార్థిని విద్యార్థులు "వందేమాతరం డ్యాన్స్ బ్యాలెట్", గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ 70 మంది విద్యార్థిని విద్యార్థులు "జగతి సిగలో జాబిలమ్మకి జగతి", ఆనందపురం జిల్లా పరిషత్ హైస్కూలు 60 మంది విద్యార్థిని విద్యార్థులు "భవతు భారతం పేట్రియాట్రిక్ సాంగ్", చంద్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ 61 మంది విద్యార్థిని విద్యార్థులు "యూనిటి ఇన్ డైవర్శిటి", ఇతర పాఠశాలల నుండి విద్యార్థిని విద్యార్థులు థింసా నృత్యం , పాడవోయి భారతీయుడు, పాడుదామా స్వేచ్ఛ గీతం తదితర నృత్యాలను

(మిగతా 2లో)

### జిల్లా కలెక్టర్ కార్యాలయంలో
## 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లా కలెక్టర్ కార్యాలయం లో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున, జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ జెండాను ఎగరు వేసి జెండాకు గౌరవ వందనం చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాధన్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి, ఆర్.డి.ఓ హుస్సేన్ సాహేబ్ లతో జిల్లా కలక్టర్ కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ విగ్రహానికి కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి ఈశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతకు ముందు కలక్టర్ బంగ్లాలో జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేసారు. పతాకావిష్కరణ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహేబ్, బంగ్లా సిబ్బంది పాల్గొన్నారు.



## వచ్చే ఎన్నికల్లో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచే పోటీ బాలినేని శ్రీనివాస్ !



వచ్చే ఎన్నికల్లో పోటీపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లోనూ తాను ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని స్వయంగా ప్రకటించుకున్నారు. తాను పోటీ చేసే నియోజకవర్గం విషయంలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టంచేశారు. అలాగే ఒంగోలు ఎంపీ సీటుకు మాగుంట శ్రీనివాసులు రెడ్డి పోటీ చేస్తారని స్పష్టంచేశారు. ఈ విషయంలో పలు రకాలుగా ప్రచారం జరుగుతోందని, దీన్ని ఎవరూ నమ్మొద్దని పార్టీ శ్రేణులను ఆయన కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాను స్లోగా ఉన్నట్లు సీఎం జగన్ చెప్పారని వెల్లడించిన బాలినేని.. ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలను తెలుసుకునే క్రమంలో ఆలస్యం జరుగుతున్నట్లు సీఎంకు వివరించినట్లు తెలిపారు. అయితే ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు తప్పక తెలుసుకుంటానని చెప్పారు.

## విరాట్ హిందూ సంఘ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగరంలోని మరిపాలెం సాయి నగర్ శ్యామ్ ఎన్‌క్లేవ్ సమీపంలో ఈరోజు ఉదయం 10:00 గంటలకు విరాట్ హిందూ సంఘ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు! కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు రామచంద్రమూర్తి జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, పురుషులు పాల్గొన్నారు. యూనియన్ జాతీయ ఉపాధ్యక్షుడు శ్రీ రాఘవేంద్ర మిశ్రా సౌజన్యంతో ఈ కార్యక్రమం ముగిసింది! కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు డిఎస్ వర్మ, ప్రధాన కార్యదర్శి కపిల్ అగర్వాల్, కోశాధికారి జి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యుడు కెవి శర్మతో పాటు 60 మందికి పైగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ రాఘవేంద్ర మిశ్రా నిర్వహించారు. సెప్టెంబర్ నెలలో మల్కాపురం ప్రాంతంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని, అందులో 500 మందికి పైగా హాజరవుతారని మిశ్రా చెప్పారు! ఈ కార్యక్రమంలో పతంజలి యోగా పీఠ్‌కు చెందిన గురు త్రిపాఠి జీ ప్రత్యేకంగా ఆధిపత్యం వహించారు.

### పంచాంగం

బుధవారం 16-08-2023
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం వర్షరుతువు
అధిక శ్రావణ మాసం

తిథి : బ. అమావాస్య ప. 01.31
నక్షత్రం : ఆశ్లేష ప. 04.51
వర్జ్యం : లేదు

విశాఖ సమాచారమ్
ప్రతులకు, ప్రకటనలకు
సెల్: 9393949345
8247526179

## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ



**తిరుపతి:** తిరుమలలో భక్తుల రద్దీ నేడు మంగళవారం పెరిగింది. స్వామివారి దర్శనం కోసం నేడు 31 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. సోమవారం స్వామివారిని 74,617 మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.67 కోట్లు వచ్చినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. 32,752 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## అమెరికాలో బాంబులా పేలిపోయిన ఇల్లు



అమెరికాలో ఒక ఇల్లు పేలిపోయిన ఘటనలో ఐదుగురు మృతి చెందారు. ఈ పేలుడు కారణంగా మరో మూడు ఇళ్లు ధ్వంసమయ్యాయి. పిట్స్ బర్స్ లోని రెసిడెన్సియల్ ఏరియా లో ఈ పేలుడు సంభవించింది. పేలుడుకి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. పేలిపోయిన ఇంట్లో ఉన్న నలుగురు పెద్దలు, ఒక చిన్నారి దుర్మరణం చెందారు. పక్కన ఉన్న ఇళ్లలో ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జయంతి (ఆగస్ట్ 16)



గౌతు లచ్చన్న భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి . లచ్చన్న సాహసానికి, కార్య దక్షతకు మెచ్చి ప్రజలిచ్చిన కితాబే సర్దార్. సర్దార్ గౌతు లచ్చన్న, వి.వి.గిరి, నేతాజి సుభాష్ చంద్రబోస్, జయంతి ధర్మతేజ, మొదలగు అనేకమంది జాతీయ నాయకులతో కలిసి భారత దేశ స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని, అనేక పర్యాయాలు జైలుకు వెళ్ళాడు. ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గంలో మంత్రి పదవి నిర్వహించిన లచ్చన్న, మద్యపాన నిషేధం విషయంలో ప్రకాశం పంతులుతో విభేదించి, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి, ప్రకాశం ప్రభుత్వ పతనానికి కారణభూతుల య్యారు. చిన్న రాష్ట్రాలు కావాలన్నారు. తెలంగాణా కొరకు మర్రి చెన్నారెడ్డితో చేతులు కలిపారు. తెలంగాణా రాష్ట్ర అవసరాన్ని, ఔచిత్యాన్ని వివరిస్తూ పుస్తకం వ్రాశారు. ఇందిరాగాంధి అత్యవసర పరిస్థితి విధించినప్పుడు వ్యతిరేకించి, స్వేచ్ఛ కోసం పోరాడారు. చౌదరి చరణ్ సింగ్, జయప్రకాష్ నారాయణ, మసాని లతో కలసి పనిచేశారు.

తెలుగు వారి రాజకీయ జీవనములో స్వాతంత్ర్యానికి ముందు, తరువాత ప్రభావితము చేసిన నాయకుడు లచ్చన్న. కేవలము స్కూల్ విద్యకే పరిమితమైనా, ఆచార్య గోగినేని రంగా ప్రథమ అనుచరుడుగా, తెలుగులో మంచి ఉపన్యాసకుడుగా, రాజాజి ఉపన్యాసాల అనువాదకుడిగా, చరిత్ర ముద్ర వేయించుకున్న బడుగువర్గ పోరాట జీవి లచ్చన్న.

సర్దార్ గౌతు లచ్చన్న ఉత్తర కోస్తా కళింగ సీమలో ఉద్దానం ప్రాంతాన (నాటి గంజాం జిల్లా) సోంపేట తాలూకాలో బారువా అనే గ్రామంలో 1909 ఆగష్టు 16 వ తేదీన ఒక సాధారణ బీద గౌడ కుటుంబములో గౌతు చిట్టియ్య, రాజమ్మ దంపతులకు 8 వ సంతానంగా పుట్టారు. లచ్చన్న తాత, తండ్రులు గౌడ కులవృత్తే వారికి కూడుబెట్టేది. ఈతచెట్లను కోత వేసి కల్లునుత్పత్తి చేయడం, అమ్మడం చుట్టు ప్రక్క గ్రామాల్లో గల కల్లు దుకాణాలకు కల్లు సరఫరా చేయడం వారి వృత్తి. కుల వృత్తిలోకి తమ పిల్లలన్ని దించకుండా చదువులను చెప్పించాలని బారువాలో గల ప్రాథమిక పాఠశాలలో 1916లో లచ్చన్న ను చేర్చారు. లచ్చన్న బారువా ప్రాథమికోన్నత పాఠశాలలో 8 వ తరగతి వరకు చదివి ప్రక్కనే ఉన్న మందసా రాజావారి హైస్కూల్లో 9 వ తరగతిలో చేరారు. అక్కడ లచ్చన్న చదువు కొనసాగలేదు. దురలవాట్లు, చెడు సహవాసాలు కొనసాగాయి. ఫలితంగా 9వ తరగతి తప్పారు . శ్రీకాకుళంలో లచ్చన్నను ఉన్నత పాఠశాలలో చేర్పించారు. అక్కడ జగన్నాథం పంతులుగారి ఇంటిలో ఉండి చదువు సాగించారు. ఆ స్కూల్లో డ్రిల్ మాష్టారు నేమాని నరసింహమూర్తి శిక్షణలో జాతీయ భావాల్ని అలవర్చుకున్నారు. విద్యార్థి జీవితంలో మార్పు జీవన విధానంలో మార్పు. ఆలోచన ధోరణిలో మార్పు, జాతి, జాతీయత అనే ప్రాథమిక రాజకీయ పాఠాల్ని నరసింహమూర్తి వద్దనే నేర్చుకోవడం జరిగింది. లచ్చన్నకు ఆనాటికి 21 సంవత్సరాలు. 1929-30 విద్యా సంవత్సరం స్కూల్ ఫైనల్ పరీక్షకు ఎంపికై హాజరయ్యారు.

మెట్రిక్యులేషన్ చదువుతుండగానే 21వ ఏట గాంధీజీ పిలుపు విని విద్యకు స్వస్తి చెప్పి స్వాతంత్ర్యోద్యమంలో దూకారు. 1930 లో మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహానికి పిలుపునిచ్చారు. దీనికి ప్రభావితుడైన లచ్చన్న బారువా సమీపంలో ఉన్న సముద్రపు నీరుతో ఉప్పు తయారుచేసి ఆ దబ్బుతో ఆ ఉద్యమాన్ని నడిపారు. విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో పాల్గొని అందరూ చూస్తుండగానే తన విలువైన దుస్తులను అగ్నికి ఆహుతి చేశారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొంటున్నప్పుడు లచ్చన్నను అరెస్టు చేసి టెక్కలి, నరసన్నపేట సబ్ జైళ్లలో నలభై రోజులు ఉంచారు. కోర్టు తీర్పు మేరకు మరో నెల రోజుల శిక్షను అతను బరంపురం జైల్లో అనుభవించవలసి వచ్చింది.

1932 వ సంవత్సరంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొంటున్న లచ్చన్నను బంధించి రాజమండ్రి జైల్లో ఐదు మాసాలు ఉంచారు. అంటరానితనం మీద కత్తి ఝుళిపించారు లచ్చన్న. అతను నడిపిన హరిజన సేవా సంఘాలు, చేపట్టిన హరిజన రక్షణ యాత్రలు ప్రజలను బాగా ప్రభావితం చేశాయి. బారువా గ్రామ వీధుల్లో యువజనులను వెంట వేసుకొని భజన గీతాలు పాడుతూ వెళుతుంటే గ్రామమంతా దద్దరిల్లుతున్నట్లు కనిపించేది. సవర్ణులలో ఆశ్చర్యం, హరిజనులలో ఆశలు రేకెత్తించేవి. రాత్రి పాఠశాలలు నిర్వహించి బడుగు వర్గాల విద్యాభివృద్ధికి అతనెంతో కృషి చేశారు. హరిజనులకు దేవాలయాలలో ప్రవేశం కలిగించారు. లచ్చన్న చేసిన ఆర్థిక సహాయంతో కుశాగ్రబుద్ధులైన ఎందరో హరిజన విద్యార్థులు ఉన్నత స్థానాలనలంకరించారు.

ఆచార్య గోగినేని రంగాతో లచ్చన్న స్నేహం రాష్ట్ర రాజకీయాలలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. మహాత్మాగాంధీ, పండిట్ నెహ్రూ గురు శిష్య సంబంధం లాంటిదే రంగా- లచ్చన్నల సంబంధం. నిడుబ్రోలులో రంగా స్థాపించిన రైతాంగ విద్యాలయంలో తొలి జట్టు విద్యార్థులలో లచ్చన్న ఒకడు. ఆ విశ్వవిద్యాలయంలో పొందిన శిక్షణ అతని భావి జీవితానికెంతో ఉపకరించింది. జమీందారీ వ్యతిరేక పోరాటానికి ఆయనను నడుము బిగించేటట్లు చేసింది. 1935లో రాష్ట్రంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ శాఖ ఏర్పడినప్పుడు దానికి అతను సభ్యుడుగా ఎన్నికయ్యారు. ఆ రోజుల్లో రైతు సంఘాలు కాంగ్రెస్ పార్టీలోని అంగాలే. 1939లో త్రిపురలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ మహాసభ, కిసాన్ సభలను ఆంధ్రలోని పలాసలో జరపాలని తీర్మానించారు. రాహుల్ సాంకృత్యాయన్ ఈ సభలకు అధ్యక్షత వహించారు. ఈ సభలు జయప్రదం కావడానికి ప్రధాన కారకుడు లచ్చన్నే. దీనితో ఆయన పేరూ, ఆయన కార్యదీక్ష దేశమంతటా తెలిసింది. లచ్చన్న అనేక కిసాన్ ఉద్యమాలు నడిపి ఆ రోజుల్లో జమీందార్ల పక్కల్లో బల్లెంగా తయారైనవారు.

స్వాతంత్ర్యోద్యమంలో చివరి పోరాటం క్విట్ ఇండియా ఉద్యమం. 1942లో ఈ ఉద్యమంలో పాల్గొన్న లచ్చన్నను ప్రభుత్వం అతి ప్రమాదకరమైన వ్యక్తిగా గుర్తించి, ఆయనను పట్టి యిచ్చిన వారికి పదివేల రూపాయల బహుమతిని ప్రకటించింది. చివరకు ప్రభుత్వమే అతనిని బంధించి మూడేళ్ళు జైల్లో ఉంచి 1945 అక్టోబరులో విడుదల చేసింది. ఆనాటి నుంచి లచ్చన్న ఆంధ్ర అగ్రనాయకులలో ఒకరైనాడు. 1947లో లచ్చన్న ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కు రాష్ట్ర శాఖ అధ్యక్షుడయ్యాడు.

1950లో ఆచార్య గోగినేని రంగా కృషి కార్ లోక్ పార్టీని స్థాపించినప్పుడు అందులో లచ్చన్న ప్రధాన పాత్ర పోషించాడు. 1953 అక్టోబరు 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. మద్రాసు ప్రభుత్వం నుంచి ఆంధ్రులకు రావలసిన ఆస్తుల విభజనను పరిశీలించడానికై ఏర్పడిన ఆంధ్ర సంఘంలో కాంగ్రెస్ నుంచి నీలం సంజీవరెడ్డి, ప్రజా పార్టీ నుంచి తెన్నేటి విశ్వనాథం, కృషి కార్ లోక్ పార్టీనుంచి లచ్చన్న సభ్యులు. ప్రకాశం పంతులు మంత్రివర్గంలోనూ, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గంలోనూ, లచ్చన్న మంత్రిగా పనిచేశాడు.

1961లో రాజాజీ స్వతంత్ర పార్టీ ఏర్పాటు చేశాడు. ఆ పార్టీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖకు సర్దార్ గౌతు లచ్చన్న అధ్యక్షుడు. 1978లో లచ్చన్న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో అధికార ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నాడు. పబ్లిక్ అక్కౌంట్స్ ఛైర్మన్ గా ఆ రోజుల్లో పనిచేశాడు. కొంతకాలం బహుజన పార్టీలో పనిచేసిన లచ్చన్న ఆ తరువాత అన్ని రాజకీయ పార్టీలతో తెగతెంపులు చేసుకుని, పార్టీలకు అతీతంగా బడుగు వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ వచ్చాడు.

సర్దార్ అంటే సేనాని. స్వాతంత్ర్యోద్యమ పోరాట వీరునిగా ఎన్నో ఉద్యమాలు నడిపిన కురువృద్ధుడు సర్దార్ గౌతు లచ్చన్న. జమీందారీ వర్గాల వ్యతిరేక పోరాట వీరునిగా ప్రజా హృదయాలలో ఆయన స్థానం చెక్కు చెదరనిది.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19 న కన్ను మూశాడు. ఈయన కుమారుడు గౌతు శ్యాం సుందర్ శివాజీ తండ్రి బాటలో రాజకీయాలలో కొనసాగుతున్నారు.

**డా. జొన్నకూటి ప్రమోద్ కుమార్,**
**పైడిమెట్ట. 9490833108**

(మొదటి పేజీ తరువాయిలు)

### పేదలు గెలిచే వరకూ, వారి బతుకులు బాగుపడే వరకూ యుద్ధం: సీఎం

బిజినెస్‌లో వరసగా మూడేళ్లు ఏపీనే నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. రాష్ట్రానికి రూ. 67,196 కోట్ల పెట్టుబడులు రాగా.. కొత్తగా 127 భారీ పరిశ్రమల ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ. 13.42 లక్షల కోట్లకు ఎంవోయూలు చేసుకున్నామని, కొత్తగా ప్రారంభమైన ఎంఎస్ఎంఈ యూనిట్లు 2,00,995 అని చెప్పారు.

**విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు**

విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నామని వైఎస్ జగన్ పేర్కొన్నారు. నాడు-నేడుతో 45 వేల ప్రభుత్వ బడుల రూపురేఖలు మారగా.. గవర్నమెంట్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం అమలు చేస్తున్నట్లు తెలిపారు. 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ విధానం.. ఎనిమిదో తరగతి పిల్లలకు ట్యాబ్‌లు అందజేస్తున్నామన్నారు. భోజనం, వసతి ఖర్చుల కోసం రూ.20 వేల వరకు వసతి దీవెన అందిస్తున్నామని.. రోజుకో మెనూతో పౌష్టికాహారంగా గోరుముద్ద అమలు చేస్తున్నామని చెప్పారు. డిగ్రీ స్థాయిలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నట్లు తెలిపారు. ట్రిపుల్ ఐటీల్లో పెండింగ్‌లో ఉన్న 3295 టీచింగ్ పోస్టుల భర్తీ చేసినట్లు పేర్కొన్నారు.

**అంటరానితనం మీద యుద్ధాన్ని ప్రకటించాం.**

పేదలు చదివే స్కూళ్లను పాడుబడేలా చేయడం అంటరానితనమేనన్నారు సీఎం జగన్. పేదలు ఇంగ్లీష్ మీడియాం చదువుకోవద్దని వాదించడం అంటరానితనమే, పేదలు వైద్యం చేయించుకునే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత సేవలు అందకుండా చేయడం కూడా అంటరానితనమే, పేదలకు ఇళ్లు ఇవ్వకూడదని అడ్డుకోవడం కూడా అంటరానితనమే, పేదల సహనాన్ని పరీక్షించడం కూడా అంటరాని తనమే, పేదలు గెలిచే వరకూ, వారి బతుకులు బాగుపడే వరకూ యుద్ధంనని స్పష్టం చేశారు.

**17 ప్రభుత్వ మెడికలు కాలేజీలు**

వైద్యశాఖలో ఏకంగా 53, 126 పోస్టుల భర్తీ చేసినట్లు వైఎస్ జగన్ వెల్లడించారు. రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికలు కాలేజీలు నిర్మిస్తున్నామని, 108, 104 సేవల కోసం కొత్తగా 1514 వాహనాల కొనుగోలు చేసినట్లు చెప్పారు.

**గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు**

స్వాతంత్ర్య సమరయోధుల బలిదానాన్ని గుర్తు చేస్తూ.. మన జాతీయ జెండా ఎగురుతోందని సీఎం జగన్ పేర్కొన్నారు. 76 ఏళ్ల ప్రయాణంలో దేశం ఎంతో పురోగమించిందని.. వ్యవసాయం, పరిశ్రమ, సేవారంగంలో ఎంతో ప్రగతి సాధించిందని తెలిపారు. రాష్ట్రంలో 50 నెలల్లో గ్రామ స్వరాజ్యానికి అర్థం తెచ్చామని చెప్పారు. గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు తెచ్చామని.. పౌర సేవల్ని ఇంటింటికి తీసుకెళ్లగలిగామని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తెచ్చామన్నారు.

**లంచాలు, వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు**

గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని మార్పులు తెచ్చామన్నారు సీఎం జగన్. సంక్షేమ పథకాలన్నీ అక్కచెల్లెమ్మల పేరు మీదే ఇస్తున్నామన్నారు. 2 లక్షల 31 వేల కోట్లను నేరుగా ప్రజలకు అందించామని.. ఎలాంటి లంచాలు, వివక్ష లేకుండా పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకే కేంద్రాలతో గ్రామ స్వరాజ్యానికి అర్థం తెచ్చామన్నారు. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేదని, అన్ని సేవలు ఇంటి వద్దకే అందిస్తున్నామని తెలిపారు.

**శరవేగంగా పోలవరం పనులు**

డివడిగా పోలవరం పనులు జరుగుతున్నాయని సీఎం తెలిపారు. 2025 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి అవుతుందన్నారు. వెలిగొండలో మొదటి టన్నెల్ పూర్తి చేశామని.. రెండో టన్నెల్ పనులు త్వరలోనే పూర్తవుతాయని చెప్పారు. సామాజిక న్యాయం నినాదం కాదు.. దాన్ని అమలు చేసి చూపామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు ప్రాధాన్యత కల్పించినట్లు చెప్పారు.

**వికేంద్రీకరణతో సరికొత్త అధ్యాయం**

అర్హులందరికీ పథకాలు అందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సీఎం చెప్పారు. రైతులకు పెట్టుబడి కోసం రైతు భరోసా అందిస్తున్నామని.. విత్తనం నుంచి అమ్మకం వరకూ రైతుకు అండగా నిలుస్తున్నామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన సేవలు అందిస్తూ, రైతులను ఆదుకునేందుకు పంటల బీమా అమలు చేస్తున్నామని చెప్పారు. వికేంద్రీకరణతో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించామని.. కొత్తగా 13 జిల్లాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

**98.5 శాతం వాగ్దానాల అమలు**

పాలనలో ఏ ప్రభుత్వం చేయని మార్పులు తీసుకొచ్చామని సీఎం జగన్ పేర్కొన్నారు. 98.5 శాతం వాగ్దానాలను అమలు చేశామన్నారు. పాల వెల్లువ ద్వారా పాడి రైతులకు అదనంగా ఆదాయం వచ్చేలా చేశామని తెలిపారు. మూతపడిన చిత్తూరు డైరీకి జీవం పోశామని అన్నారు. భూవివాదాలకు పరిష్కారం కోసం సమగ్ర సర్వే చేపట్టామని చెప్పారు.

### ఎర్రకోట సాక్షిగా మోడీ వరాల జల్లులు

ఎర్రకోట నుంచి మన దేశ విజయాలను చాటిచెప్తా" అని అన్నారు. 2047లో మనం 100 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలను చేసుకోబోతున్నాం. అప్పటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఆవిష్కృతం కావాలి.

అవినీతి, వారసత్వ రాజకీయాలు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నాయి. కుటుంబం చేత, కుటుంబం కోసం, కుటుంబానికి మేలు అన్నట్లుగా తయారయ్యాయి.

అవినీతికి వ్యతిరేకంగా యుద్ధం చేయాలి. దాన్ని సమూలంగా తుదముట్టించాలి. వారసత్వ రాజకీయాలకు స్వస్తి పలకాలి. అందులోభగంగా అక్రమాస్తుల జప్తు 20 రెట్లు పెరిగింది.

ప్రస్తుతం మనం ప్రపంచంలోనే ఐదో ఆర్థికశక్తిగా ఉన్నాం. అతి త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని నేను గ్యారెంటీ ఇస్తున్నా.

ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు మా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోంది. గత ఐదేళ్ల కాలంలో 13.5 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చినందుకు ఆనందంగా ఉంది.

రెండు కోట్ల మంది మహిళలను లక్షాధికారులుగా చేయాలనేది నా కల. మహిళల నేతృత్వంలో అభివృద్ధికి ఉన్న ప్రాధాన్యాన్ని జీ20 దేశాలు గుర్తించాయి.

### గోద్రా రైలు దహనం కేసు దోషులకు బెయిల్ నిరాకరించిన సుప్రీంకోర్టు

న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జేబీ పార్థీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. రైలు దహనం కేసులో ఈ దోషులు ముగ్గురు నిర్దిష్ట పాత్రలు పోషించినట్టు తెలిపింది. అప్పిలెంట్ల నిర్దిష్ట పాత్ర నేపథ్యంలో వారికి బెయిలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నట్టు చెబుతూ వారు పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

### సత్ప్రవర్తనే ఉజ్వల భవిష్యత్తుకు మూలం

మాట్లాడుతూ జువైనల్ శిక్షణా గృహంలో ఉన్నందుకు బాలలు చింతించవద్దని, భగవంతుడు తమకు సత్ప్రవర్తన నిమిత్తం కల్పించిన ఒక అవకాశంగా భావించాలని విజ్ఞప్తి చేశారు. ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని, శారీరక యోగా, రాజయోగా ద్వారా బాలలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగాను, మేధా సంపన్నులుగాను ఎదిగేందుకు లభించిన అవకాశంగా భావించి నిరంతరం ఆత్మ శోషణతో అయస్కాంతం మాదిరిగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని కోరారు.

### పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ప్రదర్శించారు.

ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ డా ఏ. మల్లిఖార్జున, పోలీస్ కమిషనర్ సియం త్రివిక్రమ వర్మ, జాయింట్ కలెక్టర్ కె యస్ విశ్వనాథ్, జివియంసి కమిషనర్ సియం సాయి కాంత్ వర్మ, పార్లమెంట్ సభ్యులు ఎమ్ వి వి సత్యనారాయణ, శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి, శాసన మండలి సభ్యులు వరుదు కళ్యాణి, వంశీ కృష్ణ శ్రీనివాస్, పి.రవీంద్రబాబు, గ్రంథాలయ చైర్మన్ కొండా రమాదేవి, ఏసిపి లు, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్

బుధవారం 16-08-2023

# అమిత స్వాతంత్ర్యం

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 76 ఏళ్లు పూర్తయింది. బ్రిటీష్ పరిపాలనా కాలం నాటి స్వాతంత్ర్య సంగ్రామయోధులు దాదాపుగా గతించగా, నాటి దుష్పరిపాలనను స్వయంగా చూసినవారు, అనుభవించినవారు ఇంకా కొద్దిమంది దేశంలో జీవించి ఉన్నారు. నేడు సమాజంలో ప్రాధాన్యత కలిగి ఇతరులను ప్రభావితం చేయగలిగే వ్యక్తులంతా స్వతంత్ర భారతావనిలో జన్మించినవారే. ఈ జనావళికి అస్వతంత్రత అంటే ఏమీ తెలియదు. వారికి తెలిసిందల్లా అమిత స్వాతంత్ర్యమే. బ్రిటీష్ కాలంలో మనం పరాయి పాలనలో బానిసలుగా జీవించినట్లు పూర్వీకులు తెలియపర్చగా అంతకుముందు రాజుల పాలనలో దేశం వివిధ రకాలుగా పాలించబడినట్లు చరిత్ర చెబుతోంది.

మూడు దశాబ్దాల క్రితం రాజులు, జమిందార్లు తమతమ భుజబలంతో, మేధస్సుతో రాజ్యాధికారాన్ని పొంది ప్రజలను చట్టబద్ధంగా పరిపాలించేవారు. రాజు సర్వాధికారిగా, నిర్ణయవేత్తగా గుర్తించబడినప్పటికీ వారంతా ఎంతో బాధ్యతాయుతంగా పరిపాలన సాగించి ప్రజల మెప్పుపొందారు. శ్రీకృష్ణదేవరాయులు అటువంటి గొప్ప పాలకుడుగా పేరుగాంచారు. రాజ్యాధికార కాంక్షతో కొందరు విదేశీరాజులు మనదేశంలోని కొన్ని ప్రాంతాలపై వివిధ రకాలుగా దండెత్తి కొన్ని రాజ్యాలను కైవసం చేసుకున్నారు. ఆరోజుల్లో వారు తమ ఇష్టానుసారం చట్టాలు తయారు చేసి ప్రజలను అప్పుడప్పుడు భారీ పన్నులతో హింసకు గురి చేసేవారు. ధనవంతులు, జమిందార్లు రాజులకు అడిగినంత పన్ను చెల్లిస్తేనే వారు స్థిమితంగా ఉండగలిగేవారు.

వర్తకుల రూపంలో బ్రిటీష్ వ్యాపారులు మనదేశంలో తొలుత కలకత్తాలోని ఓడరేవు గుండా ప్రవేశించి తమ తెలివితేటలతో భారతీయుల నిజాయితీని అడ్డంపెట్టుకొని విపరీతంగా ఆస్థులు సంపాదించారు. తాము సంపాదించిన సొమ్మును జమిందార్ల వద్ద, చిన్నచిన్న రాజుల వద్ద దాచుకున్నట్లుగా నటించి క్రమక్రమంగా వారి ఆస్థులను కైవసం చేసుకున్నారు. ఈ పద్ధతిలో బ్రిటీష్‌వారు అమితసంఖ్యలో భారత్‌లో ప్రవేశించి అత్యధిక భూభాగాన్ని ఆక్రమించుకొని, లండన్‌లోని అధికార పాలనా వ్యవస్థ ద్వారా ఇక్కడి రాజులను జయించి తామే పాలకులై సుమారు 200 సంవత్సరాలు మనదేశాన్ని పాలించారు. దేశంలోని చిన్నచిన్న రాజ్యాలలో గల రాజులంతా బ్రిటీష్‌వారి చేతిలో ఓడిపోయి రాజ్యాలు కోల్పోగా వాటన్నింటినీ కలిపి బ్రిటీష్ పాలకులు అఖండ భారత్‌గా ఏర్పరిచారు. బ్రిటీష్ చట్టాలను మనదేశంలో మరింత కఠినంగా ప్రకటించి భారతీయులను బానిసలుగాను, తిరుగుబాటు చేసినవారిని దేశద్రోహులుగాను పరిగణించి శిక్షించేవారు. ఆయా ప్రాంతాలలో గల బ్రిటీష్ అధికారులు జిల్లా కలెక్టర్లుగా, ప్రాంతీయ ఉన్నతాధికారులుగా తమతమ ఇష్టానుసారం భారతీయుల స్వతంత్ర జీవనానికి సంకెళ్లు వేశారు. పౌరులు తమ స్వేచ్ఛను కోల్పోయిన తరువాత ప్రాణాలకు తెగించి బ్రిటీష్ పాలకులపై తిరుగుబాటు ప్రారంభించారు. అలా తిరుగుబాటు చేసినవారిలో అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి మహనీయులు ప్రాణాలు కోల్పోగా లౌక్యం ప్రదర్శించి బ్రిటీష్ వారితో తమదైన శైలిలో ప్రవర్తించిన జవహర్‌లాల్ నెహ్రూ వంటి సమరయోధులు కట్టకడకు బ్రిటీష్ వారిని సాగనంపి భారతదేశపు తొలి పాలనాధికారులుగా, మొట్టమొదటి ప్రజాస్వామ్య అధికారపౌరులుగా ఖ్యాతిగాంచి నేటికీ దేశప్రజల నీరాజనాలు అందుకుంటున్నారు.

బ్రిటీష్‌పాలన అంతరించినప్పటికీ మనదేశంలో రాజుల పాలన మరచిపోయినప్పటికీ ఇంకా అటువంటి పాలనా ఛాయలు కొనసాగుతూనే ఉన్నాయి. వివిధ రాజకీయ పార్టీల ద్వారా ప్రజాస్వామ్యబద్ధంగా కొందరు ఎన్నికై అధికారాన్ని చేజిక్కించుకొని తమను తామే సర్వాధికారులుగా భావిస్తూ తమ ఇష్టానుసారం చట్టాలు మారుస్తూ, కొత్త చట్టాలు తయారు చేస్తూ మహమ్మదీయుల రాచరిక పాలనను మళ్లీ రుచి చూపిస్తున్నారు. తమకు ఇష్టమైన విధంగా రాష్ట్రాల కోశాగారాలను నియంత్రిస్తూ చట్టవిరుద్ధంగా సొమ్మును వెచ్చిస్తున్నారు. అడిగినవారిపై లేనిపోని నేరాలు మోపి పోలీస్ వ్యవస్థను తమ గుప్పెట్లో ఉంచుకొని వారిని కఠినంగా శిక్షిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సినిమాలలో చూసిన విధంగానే సందట్లో సడేమియా మాదిరిగా కొందరు దుష్టబుద్ధులు, దుష్టశక్తులు ఇటువంటి పాలకులకు సన్నాయి నొక్కులు నొక్కుతూ వారిని, వారి చేష్టలను వివిధ మీడియాల ద్వారా సమర్థిస్తూ తప్పులను ఒప్పులుగా ప్రతిష్టిస్తున్నారు.

బీదరికం, పేరాశ దేశప్రజలను ఇంకా బానిసలుగానే జీవించేందుకు ప్రేరేపిస్తున్నాయి. తాయిలాలకు ఆశపడి ఎందరో బీదలు తమ ఓట్లను అసాంఘిక శక్తులకు ధారబోసి వారికి అధికారం అప్పగిస్తున్నారు. కుల, మత, జాతి వంటి భావాలను అమాయక ప్రజలలో రెచ్చగొట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. దేశ సమగ్రతకు భంగం వాటిల్లుతున్నా కేవలం తమ అధికారం కోసం విదేశీ కుట్రలకు అవకాశం కల్పిస్తూ దేశ సమగ్రతకు భంగం కలిగిస్తూ స్థానికులు మళ్లీ విదేశీయుల హింసకు గురిఅయ్యేలా ప్రవర్తిస్తున్నారు. ప్రజలు అమాయకులు కారు. వారి సహనానికీ హద్దుంది. సమయం ప్రకారం తిరగబడితే దుష్టపాలకులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

# స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజనులకు సత్కారం





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** 77వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా స్థానిక గవరపాలెం, దిబ్బ వీధి శ్రీ సీతారామ దేవస్థానం ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో 70 సంవత్సరాల పైబడిన 9 మంది సీనియర్ సిటిజనులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముందు ప్రముఖ సంఘ సేవకుడు దొడ్డి వెంకట సత్యనారాయణ (బాబు జాతీయ పతాకాన్ని ఎగరవేశారు.


ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ దాడి భాస్కరరావు, కోశాధికారి మద్దాల జగదీశ్వర్ రావు, సీనియర్ జర్నలిస్టు మద్దాల కృష్ణారావు, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పివి జగన్మోహన్రావు, కొణతాల నానాజీ, వ్యాపారవేత్త ఎల్లపు సత్యనారాయణ, నాగేంద్ర స్వామి ఆలయ చైర్మన్ బి రోషన్ కుమార్, దేవస్థానం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గీతా హాస్పటల్ లో బోన్ మినరల్ డెనిస్టి టెస్ట్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** గీతా హాస్పిటల్, అనకాపల్లి నందు అనకాపల్లి వాకర్ క్లబ్ స్థానిక గీతా హాస్పిటల్ లో అనకాపల్లి వాకర్స్ సభ్యులకు ఆర్తో డాక్టర్ విన్నకోట సంపత్ చే బోన్ మినరల్ డెనిష్టి టెస్ట్(ఈఎండి) నిర్వహించారు.సుమారుగా 70 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ మాట్లాడుతూ 50 సంవత్సరాలు పైబడిన వారు ఎముకల సంరక్షణలో జాగ్రత్త వహించాలన్నారు. సాధారణంగా 60 సంవత్సరాలు పైబడిన తర్వాత ఎముకలు బలహీన పడతాయని అందుకు తగిన డాక్టర్ సలహాలు తీసుకొని క్యాల్షియం డి విటమిన్, తీసుకోవాలని అన్నారు. ప్రముఖ నేత్ర వైద్యులు వి కామేశ్వర గుప్తా , క్లబ్ అధ్యక్షులు యల్లపు శివ, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి రాపేటి నారాయణ రావు కే టి వి సత్యనారా యణ, బీవీ రమణ, మళ్ళిఖార్జున రావు, టీఎస్ అప్పారావు, డి సూరిబాబు, డాక్టర్ ఎస్ నూకరాజు, సీతారాం బాబ్జీ, కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

# అక్రమ ఆస్తులు, దోపిడీపై సమాచారం ఇచ్చేవారికి గిఫ్ట్



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జనసేన కేంద్ర కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. అనంతరం పార్టీ వీర మహిళలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో వైసీపీ సర్కార్‌పై విరుచుకుపడ్డ పవన్.. పలు కీలక ప్రకటనలు చేశారు. జనసేన పార్టీ అధికారంలోకి వస్తే ఎలాంటి కార్యక్రమాలు చేపడతామనే దానిపై కీలక వ్యాఖ్యలు చేశారు. తాము అధికారంలోకి వస్తే అక్రమ ఆస్తులు, దోపిడీపై సమాచారం ఇచ్చినవారికి గిఫ్ట్ ఇచ్చేలా ఒక కార్యక్రమం తీసుకొస్తామని స్పష్టం చేశారు. వైసీపీని గెలిపించకపోతే పథకాలు రావనే భయం వద్దని, ఇంకా మంచి చేసే పథకాలు ఇస్తామని తెలిపారు. దయచేసి అందరూ అండగా నిలబడాలని, మీ బిడ్డల భవిష్యత్తు కోసం బలంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. విశాఖ ఉక్కును కాపాడుకుంటామని, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రైవేటీకరణ అవ్వకుండా అడ్డుకుంటామని తెలిపారు. కనీసం గోదావరి జిల్లాల్లో ప్రస్తుతం తాగడానికి నీళ్లు ఇవ్వలేని పరిస్థితి ఉందని, భవిష్యత్తులో ఇంకెలా ఉంటుందో ప్రజలు ఆలోచించాలని సూచించారు. జనసేన పార్టీ అధ్వర్యంలో ప్రజా కోర్టు అనే పేరుతో సోషల్ మీడియాలో ఒక క్యాంపెయిన్ చేయనున్నట్లు ఈ సందర్భంగా పవన్ వెల్లడించారు.

38 కేసులు ఉన్న వైఎస్ జగన్ కోర్టు తీర్పులను తప్పు పడతారని, ఇది రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తుందని పవన్ విమర్శించారు. స్త్రీ తలచుకుంటే మార్పు ఖచ్చితంగా వస్తుందని, మీరు బాధ్యత తీసుకుంటే ఖచ్చితంగా మార్పు తీసుకొస్తామని వీర మహిళలకు సూచించారు. ఇంకోసారి సీఎం జగన్ అధికారంలోకి వస్తే తాము ఏపీలో ఉండలేమని, వేరే రాష్ట్రాలకు, దేశాలకు పారిపోతామని కొంతమంది అంటున్నారని, అలాంటివారు ఎక్కడకు వెళతారు? అని ప్రశ్నించారు. ఎక్కడకు వెళ్లినా వివక్ష ఉంటుందని, మీరెందుకు మీ నేల విడిచి వెళ్లిపోవాలి? ఎదురు తిరగాలి కదా..? అని సూచనలు చేశారు. రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములుకు సరైన గౌరవం దక్కలేదు. ప్రభుత్వాలు ఆయనను విస్మరించాయి. ఒక వర్గానికి ఆయనను పరిమితం చేశాయి. జనసేన పార్టీ అధికారంలోకి వస్తే ఇలాంటి మహనీయులను గౌరవించుకుంటాం. మహిళ వంటగదికి పరిమితం కాకూడదు. తన స్వంత కాళ్ళ మీద నిలబడాలి అని కోరుకుంటాను. చట్టసభల్లో మూడో వంతు సీట్లు మహిళలకు ఉండాలి. దేశం కోసం త్యాగం చేసిన మహనీయులను స్మరించుకునేలా ఒక క్యాలెండర్ విడుదల చేయాలి' అని పవన్ పేర్కొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవం.. ప్రతి ఒక్కరికి పండగ దినం




**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను చింతపల్లి మజీద్ వద్ద మంగళవారం ఘణంగా నిర్వహించారు. నూతనంగా ఏర్పడిన మజీద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మొట్ట మొదటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో మజీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ మీరా సాహెబ్ పతాకావిస్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం ప్రతి ఒక్కరికి పర్వదినం అన్నారు. 2 వందల ఏళ్ల బ్రిటీష్ పరిపాలనా కాలంలో భారతీయులు ఎదుర్కొన్న ఇబ్బందులు అన్నీ ఇన్ని కావన్నారు. అటువంటి సమయంలో బ్రిటీష్ పాలకులపై తిరుగుబాటు బావుటా ఎగుర వేసి తరిమికొట్టి స్వాతంత్ర్య ఫలాలను అందించిన స్వాతంత్ర్య సమర యోధులను ప్రతి ఒక్కరూ మననం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, శ్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యం మన జాతి సంపద: హెల్పింగ్ హాండ్స్ చైర్మన్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో పాఠశాలలు ఆఫీసులు మరియు పలు సంఘాల వాళ్ళు స్వాతంత్ర దినోత్సవ వేడుకలని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శనగర్ హెల్పింగ్ హాండ్స్ వారు సుమారు రెండు వేల జాతీయ జెండాలను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది కాగా ఆదర్శనగర్ హెల్పింగ్ హాండ్స్ చైర్మన్ రాము గంగా మాట్లాడుతూ నాడు బ్రిటిష్ వాళ్లు స్త్రీలపై చేయి వేస్తే మన వీరులు వాళ్ళ తలలు నరికింది నేడు మనం సామూహిక అత్యాచారాలు చేయడానికి కాదని ప్రజలందరూ సోదర భావంతో మెలగాలని.. స్వాతంత్రం కూడా ఒక అపురూపమైన మన జాతి సంపద. దానిని మనం కాపాడుకుంటూ అది మనకి నేర్పిన ఎన్నో మంచి విషయాలను మన తర్వాత తరాలకి చేరవేయాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదర్శనగర్ హెల్పింగ్ హాండ్స్ వైస్ చైర్మన్ రాగతి రామకృష్ణ, డిజే రాము, జనార్ధన్, మురళి యాదవ్, రాజేష్, శ్రీకాంత్ ఉప్పిలి ఇంకా పలువురు పాల్గొన్నారు.. పౌరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు

# మీ గుండెలకు జగనన్న భరోసా.. హార్ట్ అటాక్ వస్తే.. గోల్డెన్ అవర్‌లో 40 వేల ఇంజక్షన్



అమరావతి, ఆగస్టు 15: ఈ మధ్య కాలంలో గుండెపోట్లు పెరిగిన విషయం తెలిసిందే. ఒత్తిడి, మానసిక ఆందోళన, జీవన విధానంలో మార్పులుకోవిడ్ తదనంతర పరిణామాలు.. కారణం ఏదైతేనేం.. హార్ట్ అటాక్స్, స్ట్రోక్స్ పెరిగాయి. ఈ ధోరణికి గల కారణాలు తెలుసుకునేందుకు ప్రజంట్ రీసెర్చ్‌లు జరుగుతున్నాయి. పిల్లలు, టీనేజర్స్, యువత కూడా గుండెపోట్ల బారిన పడటం.. ప్రాణాలు విడవడం పట్ల వైద్య నిపుణులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే గుండెపోటు చికిత్సలపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇటీవల పెరుగుతున్న గుండెపోటు మరణాల నివారణకు కొత్త వ్యవస్థను తీసుకొచ్చింది. STEMI పేరుతో గుంటూరు, విశాఖ, కర్నూలు, చిత్తూరుల్లో కొత్తగా పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారభించింది. గుండెపోటు వచ్చిన తొలిగంట గోల్డెన్ అవర్ కావడంతో ఆ సమయంలో చికిత్సపై ఫోకస్ పెట్టింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో STEMI పేరుతో ప్రత్యేక చికిత్సా కేంద్రాన్ని ప్రవేశపెట్టింది. గోల్డెన్ అవర్‌లో ప్రాణాలు నిలిపే 40వేల విలువ చేసే ఇంజక్షన్ ఉచితంగా అందించనుంది. పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలను బట్టి మిగతా అన్ని జిల్లాల్లో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బందికి సైతం శిక్షణ ఇవ్వనున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం ICMRసహకారం తీసుకోనుంది ఏపీ సర్కార్. క్షణ క్షణానికీ కౌంట్‌డౌనే. ఔను.. చూస్తుండగానే కుప్పకూలిపోతున్నారు. చూస్తుండగానే ప్రాణాలు పోతున్నాయ్.. ఏమైందో తెలుసుకుని CPR చేసేలోపే గుండెలు ఆగిపోతున్నాయ్. మనిషి జీవితానికి గ్యారెంటీ లేదని నిరూపిస్తున్నాయి.. ఈ వీడియోలన్నీ చూస్తుంటే మామూలుగా ఫిట్‌గా ఉన్నాం అనుకునే వాళ్లకు కూడా గుండెలు జారిపోతున్నాయ్..ఆరోగ్యంగా ఉండాలంటే జిమ్ చేయాలంటారు. ఇప్పుడు జిమ్ చేసే గుండెల్లో కూడా దమ్ లేకుండా పోయింది. ఎందుకిలా జరుగుతోంది.. ఆహారపు అలవాట్లు, లైఫ్‌స్టైల్‌లో తేడా వల్లే గుండెలు ఆగిపోతున్నాయా..లేదంటే కరోనా తర్వాత వస్తున్న ఆరోగ్య సమస్యలా.. అసలు కారణమేంటి.. డాక్టర్లకే అందని బ్రహ్మపదార్థమా ఈ గుండెపోటు..మనిషి శరీరంలో..పిడికిలెంత గుండెలో జరుగుతున్న కల్లోలాన్ని గుర్తించలేరా..ఆ కల్లోలానికి కారణమేంటో కనుక్కోలేరా..యువ గుండెల్లో సునామీని సునాయాసంగా దాటించలేరా. అలాంటప్పుడు ఇంత టెక్నాలజీ ఎందుకు.. ఇంత పెద్ద పెద్ద డాక్టర్లు ఏం చేస్తున్నారు. అణువణువు శోధించే వాళ్లు..గుండె లయను మదించలేరా..మర్మం కనిపెట్టలేరా..మందు తయారు చేయలేరా.. అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కరోనా.. దాని కోసం తీసుకున్న మందులు కూడా.. గుండెపై ప్రభావాన్ని చూపిస్తున్నాయంటూ తెగ ప్రచారం జరుగుతోంది. ఏమైనా.. గుండె బలహీనపడింది. యువకుల్లో సైతం పనిచేయక ఆగిపోయేంత ఒత్తిడికి గురౌవుతోంది. ఇప్పటికైనా గుండెను పదిలం చేయడానికి చాలా మార్పులు రావాలి. లేకపోతే.. గుప్పెడంత గుండె.. ఎప్పుడు ఆగిపోతుందో ఎవ్వరూ పసిగట్టలేరు. అందుకే.. శారీరక వ్యాయామంతో పాటు మెంటల్ పీస్ కూడా ఎంతో ముఖ్యమని సూచిస్తున్నారు.

# పరవాడలో జనసేన ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడలో స్థానిక వినాయకుని గుడి వద్ద జనసేన నాయకులు మెకానిక్ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు విచ్చేసి జెండా ఆవిష్కరించారు. పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రార్థన గీతం ఆలపించారు. వారికి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చుక్కనాగు, కూండ్రపు చినబాబు, వెల్డింగ్ షాప్ రాము, పైలా హరి , మురళి, గబ్బర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# పంద్రాగస్టు సందర్భంగా నగర మేయరు సందేశం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** 77వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. నేడు మన భారతదేశం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకుంటోంది. స్వాతంత్ర్య సాధనకు కృషి చేసిన ఎందరో మహానుభావులు, వారందరికీ పేరుపేరునా అభివందనాలు. విశాఖ నగర వాసులందరికీ అభినందనలు తెలియజేసుకుంటున్నాను.

2022వ సంవత్సరంలో సాధించిన ప్రగతిని, లక్ష్యాలను మననం చేసుకుంటూ, లోపాలను సవరించుకొని 2023లో మరింత నూతనోత్సాహంతో విశాఖ నగర సమగ్ర ప్రగతిని నిర్దేశించుకుని, లక్ష్యసాధనకు సమిష్టిగా కృషి చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశ పెట్టిన సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను జివిఎంసి అందించడం జరుగుచున్నదని తెలియపరుచు చున్నాము. జివిఎంసిలో 98వ వార్డు సభ్యుల ద్వారా ప్రజలకు కల్పించవలసిన మౌలిక సదుపాయాలను, సేవలను జివిఎంసి అందిస్తోందన్నారు.

**ఇంజనీరింగ్ విభాగం:** జివిఎంసి పరిధిలో 2022-23 సంవత్సరానికు సంబంధించి సాధారణ నిధులతో చేపట్టిన 1018 పనులను 181 కోట్ల72లక్షల83వేల రూపాయల అంచనాలతో చేపట్టగా, అందులో 455 పనులను 61 కోట్ల 57 లక్షల 78 వేల వ్యయంతో పూర్తికాగా, 105 పనులు పురోగతిలో ఉండగా, 87 పనులు ఆరంభ దశలో ఉన్నవి. 371 పనులు టెండర్ దశలో ఉన్నవి. 2023-24 సంవత్సరమునకు సంబంధించి జివిఎంసి పరిధిలో 650 పనులను 121 కోట్ల 83 లక్షల 64 వేల రూపాయల అంచనాలతో చేపట్టగా, అందులో 76 పనులను 60 కోట్ల 7 లక్షల 83 వేల వ్యయంతో పూర్తి చేయటం జరిగినది. 101 పనులు పురోగతిలో ఉండగా, 89 పనులు ఆరంభ దశలో ఉన్నాయి. 384 పనులు టెండర్ దశలో ఉన్నాయి.

వార్డు అభివృద్ధి ప్రణాళికలో భాగంగా, జివిఎంసి పరిధిలో 98 వార్డులకు గాను, 938 పనులను, 14కోట్ల8లక్షల11 వేల రూపాయల అంచనాలతో చేపట్టగా, 542 పనులు పూర్తయినవి. 119 పనులు పురోగతిలో ఉన్నవి. 138 పనులు ప్రారంభించి ఉన్నవి. 139 పనులు టెండర్ దశలో ఉన్నవి. జివిఎంసి పరిధిలో 20 బస్సు షెల్టర్స్ నిర్మాణం కొరకు 4 కోట్ల63లక్షల రూపాయలతో ప్రతిపాదించడమైనది. అందులో 12 పనులు పూర్తికాగా, 8 పనులు పురోగతిలో ఉన్నవి. జివిఎంసి పరిధిలో 19 ప్రధాన రహదారులను విస్తరణ చేసి అందంగా తీర్చిదిద్దుటకు గాను 117 కోట్ల 23లక్షల రూపాయలతో ప్రతిపాదించడమైనది. అందులో 11 టెండర్ దశలో ఉన్నవి. ఒక పని ప్రారంభించవలసి యున్నది. మిగిలిన 7 పనులు పరిపాలన ఆమోదం కొరకు ఉన్నవి.

జివిఎంసి పరిధిలో రోడ్ల మరామ్మత్తుల (పాట్ హెూల్స్) కొరకు 66 పనులకు 5 వేల 451 పాట్ హెూల్స్ మరమ్మతు చేయుటకు 8 కోట్ల 54 లక్షలతో పనులు పూర్తయినవి. రెండవ దశలో అన్ని జోన్లలో 4 వేల 975 పాట్ హెూల్స్ కు గానూ, 4 కోట్ల 10 లక్షల 67 వేలకు అంచనాలతో చేపట్టి పనులు పూర్తి అయినవి.



విశాఖ నగరం భారతదేశంలోనే నాల్గవ పరిశుభ్ర నగరంగా ఖ్యాతిని దక్కించుకొని, 2023 స్వచ్ఛ సర్వేక్షన్ లో మొదటి స్థానం సాధనే లక్ష్యంగా జివిఎంసి కృషి చేస్తోంది. ఈ విషయమై, ప్రజాభిప్రాయ సేకరణ కొరకు ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పర్యావరణ హితమైన పరిశుభ్ర నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు ప్రముఖులు, సినీ మరియు స్పోర్ట్స్ సెలబ్రిటీల వద్ద నుండి స్ఫూర్తిదాయకమైన సందేశ కార్యక్రమాలను జివిఎంసి చేపడుతోంది. ఆ సందేశాలను జివిఎంసి సిటి ఆపరేషన్ సెంటర్ ద్వారా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తూ నగర ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుచున్నది. మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రజలకు మరింత మౌలిక సదుపాయాలు, మెరుగైన సౌకర్యాలు అందించుట కొరకు, నిత్యం సంక్షేమ కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు చేపడుతుంది. విశాఖ నగర అభివృద్ధికి తోడ్పాటును అందించే దిశలో ముఖ్యంగా ప్లాస్టిక్ వస్తువుల నుండి విశాఖ నగరానికి విముక్తిని కలిగించేందుకు సహకరిస్తున్న ప్రజా ప్రతినిధులకు, కౌన్సిల్ సభ్యులకు, ప్రజా సంఘాలకు, నివాసిత సంక్షేమ సంఘాలకు, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్లకు, సినీ, క్రీడా ప్రముఖులకు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, ఫోటోగ్రాఫర్లకు వీడియో గ్రాఫర్లకు మరీ ముఖ్యంగా విశాఖ నగరం నిత్యం పరిశుభ్రంగా ఉండేందుకు చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు, సహకరిస్తున్న విశాఖపట్నం నగర ప్రజలకు విశాఖపట్నం నగరపాలక సంస్థ తరపునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తు న్నానన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ నారాయణరావు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐపిఈ 2023 నందు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, వివిధ అంశాలపై కళాశాలలో నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. స్వతంత్ర దినోత్సవ ప్రాముఖ్యత, విద్య యొక్క అవశ్యకతలను గురించి ప్రిన్సిపల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధికి కృషి చేద్దాం



**విజయనగరం:** దేశాభివృద్ధికి ప్రతీ ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పిలుపునిచ్చారు. కలెక్టొరేట్ వద్ద జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించి, గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం కృషి చేసిన మహనీయుల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. దాదాపు 250 ఏళ్లపాటు దేశాన్ని పరిపాలించిన బ్రిటీష్ పాలకులను తరిమికొట్టడంలో, మన సమరయోధుల పోరాటం మనందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. వారు ఇచ్చిన స్ఫూర్తితో, దేశాభివృద్ధికి ప్రతీఒక్కరూ కంకణబద్ధులు కావాలని కోరారు. అనంతరం పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఓ ఎం.గణపతిరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వాడవాడలలో రెపరెపలాడిన జాతీయ జెండాలు



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి పల్లెల్లో కూడా మువన్నెల జెండాలు గ్రామీణులందరు ఘనంగా జరుపుకున్నారు. అధికారికంగా స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నిచోట్లా పాల్గొన్నారు. మండల పరిషత్ రెవిన్యూ పంచాయతీ కార్యాలయాలలో అధికారులు, నాయకుల సమక్షములో ఘనంగా జరిగాయి. ఎంపీడీఓ ఎమ్మార్వో ఈఓ పి ఆర్ డి తదితర అధికారులు అమరవీరులను స్మరణ చేసుకొని వారు దేశం కోసం చేసిన త్యాగాలను గుర్తు చేసారు. స్వాతంత్ర సమరయోధులను, ముఖ్యంగా ఝాన్సీ లక్ష్మీబాయ్, సర్దార్ వల్లభాయ్ పటేల్, అల్లూరి సీతా రామరాజు, భగత్ సింగ్ మొదలైన నాయకుల త్యాగం ఫలితంగా స్వేచ్ఛ స్వాతంత్ర్యాలతో ధైర్యంగా జీవిస్తున్నామని వీరన్నారు. వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ మాట్లాడతూ ఎందరో మహానుభావుల త్యాగ ఫలితమే ఇది అని, వారి స్ఫూర్తితో నేటి బాలలే రేపటి పౌరులు అని వారన్నారు. విద్యార్థి దశ నుంచి దేశభక్తి కలిగివుండాలని దేశసమైక్యతను కాపాడు కోవాలని వక్తలు తెలిపారు. ప్రతి గ్రామంలోని పాఠశాలలో, కళాశాలలో, రెసిడెన్సియల్ స్కూల్ కేజీబీవీలో ఉపాధ్యాయులు అమరవీరుల త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి జెడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, ఎంపీపీ రత్నం, వైస్ ఎంపీపీ నానాజీ, గ్రామ సర్పంచ్ జయ రత్నకుమారి, కొప్పిశెట్టి వెంకటేష్, నానాజీ, మేడేటి శంకర్ తదితర నాయకులు, ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు అధికారులు పాల్గొన్నారు. మనభాల వాని పాలెం పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రసాద్ సూకరాజు, అప్పలరాజు, వెంకటరామిరెడ్డి, నాగేశ్వరావు, గ్రామంలోని పెద్దల సహకారంతో క్రీడలు నిర్వహించి మిఠాయిలు పంచారు. పిల్లలు దేశభక్తి గీతాలు ఆలపించారు. పిల్లలు పెద్దల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించి చదువులో ప్రతిభ కనబర్చి తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకుని రావాలని సి హెచ్ ప్రసాద్ అన్నారు. గ్రామ ఇన్ఛార్జ్ సర్పంచ్ ప్రగడ వీరబాబు, వార్డ్ మెంబెర్స్ బుజ్జి కృష్ణారావు, రాజు, పాము గణేష్, ఎంపీటీసీ దేవుళ్ళు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# జె.కె.హై స్కూల్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** 77వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఎంవిపి కాలనీ జె. కె. హైస్కూల్ ఆవరణంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్.వి.జయకుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఎందరో మహనీయుల త్యాగ ఫలితంగా మనకు స్వాతంత్ర్యం లభించిందని, అదే స్ఫూర్తితో విద్యార్థులు తల్లిదండ్రులను, గురువులను గౌరవించి, క్రమశిక్షణతో, పట్టుదలతో విద్యను అభ్యసించి, దేశ అభివృద్ధి లో భాగస్వామ్యం కావాలని కోరారు.

ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపించగా ఎస్.ఎస్.సి 2022-23లో అత్యధిక మార్కులు సాధించిన ఎస్.ఎస్. ఏ వర్మ, కె . శ్రీజ లకు షీల్డ్స్, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులు డైరెక్టర్ ఆర్. వి రవికుమార్ అందజేశారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఉపాధ్యాయులు కె.అనిల్ కుమార్, టి. సాయికుమార్, కె. లక్ష్మణ్, ఏ. సత్యశ్రీ, ఎన్. కృష్ణకుమారి, ఎస్. పద్మ, సెల్వీ, ధన జ్యోతి, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** పరవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 77వ స్వతంత్ర దినోత్సవ సందర్భంగా మంగళవారం కార్యాలయం ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ముందుగా వందేమాతర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంపీపీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎందరో అమరవీరుల త్యాగఫలంగా వచ్చిన ఈ స్వాతంత్ర్యాన్ని అందిపుచ్చుకొని శాస్త్ర సాంకేతిక రంగాలలో భారతదేశం దూసుకు వెళ్తుందని, రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే అగ్రగ్రామీ దేశంగా నిలుస్తుందని అన్నారు. ప్రజలందరూ దేశభక్తి కలిగి ఉండాలని కోరారు. ప్రతి ఒక్కరు స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలని, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలని, ప్రతి భారతీయుడు ఎంతో గర్వంగా జాతీయ జెండా పట్టుకుని తిరగాల్సిన సమయం ఇదని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో లక్షలాదిమంది, నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్, కొమరం భీమ్, చంద్రశేఖర్ ఆజాద్ లాంటి వారు బ్రిటీష్ వారి గుండెల్లో రైళ్ల పరిగెత్తించడంతో స్వాతంత్యం వచ్చిందని వీరందరినీ స్మరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, ఆర్ఇసిఎస్ మాజీ చైర్మన్ చల్ల కనకరావు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామరావు, ఎంపీడీఓ హేమ సుందరరావు, ఈఓర్డి పద్మజ, మండల జేసిఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, పెద్దచెరువు రైతుసంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ పైల అప్పల నాయుడు, వై.సి.పి నాయకులు బొద్దపు చిన్నారవు, కావలి వాసు, కావలి రాజు, వర్రీ హరి, పైల పైడం నాయుడు, ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గురుస్థానం ప్లే స్కూల్‌లో ఘనంగా జెండావందనం కార్యక్రమం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈరోజు గురుస్థానం ప్లే స్కూల్‌లో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డెరైక్టర్ ఎస్.ఖాన్ మాట్లాడుతూ సిబిఎం కాంపౌండ్ బ్రాంచ్‌లో జరిగిన ఈ వేడుకలో సిబిఎం కాంపౌండ్, పిఎం పాలెం బ్రాంచ్‌ల విద్యార్థులు పాల్గొన్నారు అన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులంతా స్వాతంత్ర్య సమరయోధులు, సైనికుల దుస్తులు ధరించి ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో పాల్గొనటమే కాకుండా స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టత గురించి విద్యార్థులు ప్రసంగించారని అన్నారు.

చిన్నతనం నుండే మనం మన స్వాతంత్ర్య దినోత్సవం యొక్క ప్రాముఖ్యత గురించి పిల్లలకు నేర్పించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్- నిషా.కె, ప్రిన్సిపాల్- గౌసియా బేగం, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ పాలెం లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగ ఫలాలను గుర్తు చేసుకుంటూ, ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి కోసం మనమంతా ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి రాజేష్, మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు, పాఠశాల సిబ్బంది, సచివాలయం సిబ్బంది, మాజీ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, వైస్ సర్పంచ్ సూరాడ పెంటయ్య, వార్డు మెంబరు ఒలిశెట్టి పోలమ్మ, చింతకాయల మసేను, ఒలిశెట్టి తాతారావు, కణితి చినసోమేష్, మరియు అంగన్ వాడీ సిబ్బంది, గ్రామ యువకులు, తదుపరి నాయకులు పాల్గొన్నారు.



## వార్డు శానిటేషన్ కార్యదర్శులకు విజయవాడలో ప్రతిభా పురస్కారాలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జివిఎంసి పరిధిలో పరదేశిపాలెం విలేజ్-2, గొడారి గోతులు, సత్తివానిపాలెం వార్డు సచివాలయాల ప్రజలకు మెరుగైన సేవలు అందించినందుకు గాను, విశాఖ నగరం నుంచి ఆయా వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు ఉప్పల శ్రీను, చిట్ల రాజీవ్, బోని అనిల్ కుమార్‌లకు భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా ప్రతిభా పురస్కారాలను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయం శాఖ డైరెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశా విజయవాడలో ప్రధానం చేసి అభినందించారు.

## సమత కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సమతా కళాశాలలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వచ్చేసినటు వంటి కళాశాల డీన్ ప్రొఫెసర్ ఎస్. విజయరవీంద్ర గారు జెండాను ఆవిష్కరించి, విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం యొక్క అవశ్యకతను తెలియజేశారు. అనంతరం కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల యొక్క త్యాగఫలమే ఈ స్వాతంత్ర్య దినోత్సవం అని తెలియజేశారు. అనంతరం కళాశాలలో వివిధ సెమిస్టర్ల లో ఫస్ట్ & సెకండ్ ర్యాంక్ సాధించినటువంటి విద్యార్థులకు క్యాష్ ప్రైజ్ అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వివేకానంద సంస్థలో ఘనంగా 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వివేకానంద సంస్థలో ఘనంగా నిర్వహించారు. క్రమానికి ముఖ్య అతిథులుగా వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్. సి.ఎం.ఎ. జహీర్ అహ్మద్, వైసిపి యువ నాయకులు ద్రోణం రాజు శ్రీవాత్సవ, రోటరీ ఎలైట్ సంస్థ ప్రెసిడెంట్ టి.దుర్గారావు, రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు మక్సుద్ అహ్మద్‌లు పాల్గొన్నారు. డాక్టర్ జహీర్ అహ్మద్, జెండా ఎగరవేసి, జెండా వందనం చేశారు. అనంతరం వివేకానంద సంస్థ నిర్వహించిన డ్రాయింగ్ కాంపిటీషన్స్‌లో పాల్గొన్న ట్యూషన్ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జహీర్ అహ్మద్, శ్రీవాత్సవ, దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎంతోమంది అమర వీరుల త్యాగఫలం ఈ స్వాతంత్ర దినోత్సవం. దేశ ప్రజలందరూ కూడా దేశభక్తిని కలిగి, ఐక్యమత్యంతో మన దేశాన్ని మనం కాపాడుకోవాలి. విద్యార్థులందరికీ దేశభక్తి కలిగేలా, మన అమరవీరుల చరిత్రలను తెలియజేయాలి అని వారు తెలియజేశారు. అనంతరం భారీ జెండా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు అప్పారావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## కేంద్రంలో రాజకీయ స్థానం అవసరం లేదన్న మమతా బెనర్జీ



కేంద్రంలో తమకు రాజకీయ స్థానం అవసరం లేదని, బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడాన్నే తాము కోరుకుంటున్నట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో I.N.D.I.A. కూటమిదే విజయమన్నారు. మంగళవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎర్రకోటపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగమే ఆయనకు చివరిది కానుందన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో మోదీ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. జాతీయ రహదారుల ప్రాజెక్టులపై కాగ్ ఇచ్చిన నివేదికను ఖర్గే ప్రస్తావించారు. రాజకీయ ప్రత్యర్థుల గురించి మాట్లాడే ముందు తమ ప్రభుత్వంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్నారు. బీజేపీ దోపిడీ, అవినీతి దేశాన్ని నరకం వైపు తీసుకు వెళుతున్నాయన్నారు.

# అంబరాన్నంటిన స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు



**విజయనగరం:** 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పి ఎం.దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మంత్రిని సాదరంగా ఆహ్వానించారు. మంత్రి ముత్యాలనాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. కవాతు (పెరేడ్) చూసిన పరిశీలన అనంతరం, జిల్లా ప్రజలకు మంత్రి తన స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని వినిపించారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అన్నారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను, జిల్లాకు మైలు రాళ్లుగా నిలిచిన కార్యక్రమాలను వివరించారు. పోలీస్ పెరేడ్ నిష్క్రమణ అనంతరం శాంతి పావురాలను ఎగుర వేశారు.

ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సిలు పాకలపాటి రఘువర్మ, డాక్టర్ సురేష్‌బాబు, గజపతినగరం ఎంఎల్‌ఏ బొత్స అప్పల నరసయ్య, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, డిసిసిబి ఛైర్మన్ వేచలపు వెంకట చినరామినాయుడు, డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, న్యాయ మూర్తులను, ఉన్నతాధికారులను, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలు, పతక విజేతలు, ఇతర ప్రముఖులను మంత్రి ముత్యాల నాయుడు పరిచయం చేసుకొని కృతజ్ఞతలు తెలిపారు. నషాముక్త భారత్ పోస్టర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా, పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతమూ అలరించాయి. భారతి పిలిచిందోయ్ మన భారతి పిలిచిందోయ్ గీతాన్ని గంట్యాడ కెజిబివి, మనదేశం భారత దేశం గీతాన్ని సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, చక్‌దే ఇండియా పిరమిడ్ ప్రదర్శనను ద్వారకామయి అంధుల పాఠశాల, ఏ దేశమేగినా ఎందు కాలిడినా పాటను కొండవెలగాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పుణ్యభూమి నాదేశం గీతాన్ని ఫోర్ట్ సిటీ ఇంగ్లీష్‌మీడియం స్కూల్, ఇండియా హమారే గీతాన్ని ఎపి రెసిడెన్షియల్ స్కూల్స్ నెల్లిమర్ల, వియ్యంపేట, చీపురుపల్లి పాఠశాలల విద్యార్థులు చక్కని నృత్యాలతో ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వరరెడ్డి పర్యవేక్షించారు.

**ఆకట్టుకున్న ప్రగతి శకటాలు**

స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగంగా నిర్వహించిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ ప్రభుత్వ శాఖలు తమ ప్రగతిని, ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తూ ఈ శకటాలను ప్రదర్శించాయి. జిల్లా వ్యవసాయ, ఉద్యాన, జౌళి, పట్టుపరిశ్రమ శాఖలు సంయుక్తంగా శకటాన్ని ప్రదర్శించాయి. చిరు ధాన్యాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు, వ్యవసాయ యాంత్రీకరణను వివరిస్తూ జిల్లా వ్యవసాయశాఖ, మహిళా సంక్షేమమే ధ్యేయంగా మహిళలకు అందిస్తున్న పథకాలపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, వలసల నివారణకు, గ్రామీణ పేదలకోసం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమల్లో జిల్లా ప్రగతిని వివరిస్తూ జిల్లా నీటి యాజమాన్య సంస్థ శకటాలను ప్రదర్శించాయి. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో ప్రవేశపెట్టిన విప్లవాత్మక సంస్కరణలను కళ్లకు కడుతూ సిబిఎస్‌సి స్కూల్, బైజూస్, డిజిటల్ క్లాస్ రూమ్, డిజిటల్ బోర్డులు, సహిత విద్య, నాడు-నేడు తదితర అంశాలపై విద్యాశాఖ ప్రదర్శించిన శకటం అందరినీ ఆలోచింపజేసింది. కుటుంబ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఇంటి వద్దనే వైద్యం అందిస్తున్న తీరును జిల్లా వైద్యారోగ్యశాఖ, ప్రభుత్వ వైద్య కళాశాల నమూనాతో ఎపిఎంఎస్ఐడిసి, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ త్రాగునీటి సరఫరాకు జరుగుతున్న కృషిపై గ్రామీణ నీటిసరఫరా శకటాలను ప్రదర్శించాయి.

నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంపై గృహనిర్మాణశాఖ, జిల్లాలో పలు ప్రతిష్టాత్మక అంతర్జాతీ విమానాశ్రయం, జాతీయ రహదారులు, ఫ్లోటింగ్ జెట్టీ తదితర ప్రాజెక్టులకు చేసిన భూ సేకరణపై విజయనగరం ఆర్‌డిఓ విభాగం శకటాలను ఏర్పాటు చేశాయి. కొత్తగా ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఇంటికి పోషకాహార సరుకులను తీసుకెళ్లే విధానం, తల్లీబిడ్డా ఆరోగ్యం కోసం తీసుకోవల్సిన చర్యలపై మహిళా శిశు సంక్షేమ శాఖ, వన్యప్రాణుల ఆవాసాలను సంరక్షిద్దాం-జన సమూహాల్లోకి రాకుండా నివారిద్దాం నినాదంతో అటవీశాఖ, వ్యవసాయానికి ఉచితంగా అందిస్తున్న వైఎస్ఆర్ ఉచిత విద్యుత్ పథకం, టోల్ ఫ్రీ నెంబరు 1912పై విద్యుత్ శాఖ, సచివాల యాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాన్ని భారీ ఎత్తు చేపట్టిన పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, అత్యవసర సమయంలో వినియోగించే 207 వజ్ర వాహనం, దిశ జాగృతి యాత్రా వాహనాలతో జిల్లా పోలీసు శాఖలు శకటాల ప్రదర్శన నిర్వహించాయి. పెరేడ్ గ్రౌండ్‌లో ప్రదర్శన అనంతరం విజయనగరం పట్టణ ప్రధాన రహదారుల్లో మయూరి జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్ వరకు ఈ శకటాల ప్రదర్శనను నిర్వహించి పౌరులను ఆకట్టుకున్నాయి. శకట ప్రదర్శనను ప్రత్యేక ఉప కలెక్టర్ డి.వెంకటేశ్వర్రావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ చేసిన మాక్ డ్రిల్, అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై అవగాహన కల్పించింది.

**ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు**

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలను అందించిన జిల్లా అధికారులను, సిబ్బందిని అభినందిస్తూ ఇన్‌ఛార్జి మంత్రి చేతులమీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ముందుగా ఇటీవల కామన్‌వెల్త్ క్రీడల్లో బహుమతులు సాధించిన జిల్లా క్రీడాకారులు ఎస్.పల్లవి, బి.హారిక, సిహెచ్ శ్రీలక్ష్మి, ఎస్.గురు నాయుడులను పతకాలతో అభినందించారు. పోలీసు శాఖలో విశిష్టమైన సేవలను అందించి, మహోన్నత సేవా పురస్కారం, సేవా పతకాలను సాధించిన అధికారులకు పతకాలను అందించిన అభినందించారు. అనంతరం ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు.

**ప్రగతిని ప్రతిబింబించిన స్టాల్స్**

వివిధ ప్రభుత్వ శాఖలు తమ ప్రగతిని ప్రతిబింబిస్తూ, పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. జిల్లా పంచాయితీ, గ్రామీణాభివృద్ధి సంస్థ, మత్స్యశాఖ, ఉద్యాన శాఖ, ఎపి సూక్ష్మ మరియు బిందు సేద్యం, సర్వే మరియు భూ రికార్డుల శాఖ, చేనేత జౌళిశాఖ, జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ, వైద్యారోగ్యశాఖ, వైద్యారోగ్యశాఖ, పశు సంవర్థక శాఖ, సాంఘిక సంక్షేమశాఖ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, సెట్విజ్, విభిన్న ప్రతిభా వంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖలు స్టాల్స్‌ను ఏర్పాటు చేసి, శాఖాపరమైన కార్యక్రమాలను ప్రదర్శించాయి. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాల నాయుడు, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సి డాక్టర్ సురేష్ బాబు, ఎంఎల్‌ఏ బొత్స అప్పలనరసయ్య, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఓ ఎం.గణపతి రావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు. స్టాల్స్ ఏర్పాటును ప్రత్యేక ఉప కలెక్టర్ బి.సుదర్శన దొర పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా పలువురు లబ్దిదారులకు మంత్రి ముత్యాల నాయుడు, ఇతర ప్రజా ప్రతినిధుల చేతులమీదుగా ఉపకరణాలను పంపిణీ చేశారు. ఎపి మైక్రో ఇరిగేషన్ ఆధ్వర్యంలో 18 మంది రైతులకు సుమారు రూ.6.5లక్షలు విలువ చేసే బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.2.16 లక్షలు విలువ చేసే లాప్‌టాప్‌లు-5, స్కెచెస్ -3 జతలు, హియరింగ్ మిషన్లు-2 జతలు, వీల్ ఛైర్‌ను పంపిణీ చేశారు. షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐదుగురు ఎస్‌సి రైతులకు ప్రకృతి సేద్యం చేసేందుకు ఒక్కొక్కరికి సుమారు రూ.10వేలు విలువైన 5 విత్తన కిట్లు పంపిణీ చేశారు. బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో కాపునేస్తం పథకం క్రింద కాపు మహిళలకు ఒక్కొక్కరికీ రూ.15వేలు చొప్పున 5,934 మందికి ఆర్థిక ప్రోత్సాహకాన్ని, పరిశ్రమల శాఖ ద్వారా జగనన్న బడుగు వికాశం క్రింద ఆరుగురు లబ్దిదారులకు రూ.66.4 లక్షలు విలువైన స్వయం ఉపాధి యూనిట్లను అందజేశారు. మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా షాదీ తోఫా క్రింద ఒక ముస్లిం జంటకు లక్ష రూపాయల ప్రోత్సాహకాన్ని అందించారు. డిఆర్‌డిఏ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో, మహిళలు చిరుధాన్యాలతో చేసిన వంటకాలను మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు రుచి చూసి, వారిని అభినందించారు.

## యూఎస్ స్టూడెంట్ వీసా ట్రెండ్ మామూలుగా లేదుగా!



గతంతో పోలిస్తే ఈ ఏడాది యూఎస్ స్టూడెంట్ వీసాల ట్రెండ్ మామూలుగా లేదని తెలుస్తోంది. తాజాగా యూఎస్ స్టేట్ డిపార్ట్మెంట్ నుంచి వచ్చిన తాజాగా నివేదికలు ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రీ పాండమిక్, ఆఫ్టర్ పాండమిక్ లెక్కలు కూడా ఘణనీయంగా మార్పును సూచిస్తున్నాయి.

అవును... యూఎస్ స్టేట్ డిపార్ట్మెంట్ నుండి వచ్చిన తాజా డేటా ప్రకారం ఎఫ్-1 విద్యార్థి వీసాల జారీపై కీలక విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం గతంతో పోలిస్తే ఘణనీయంగా పెరుగుదల కనిపిస్తోంది. 2022లో మొత్తం 4,11,131 ఎఫ్-1 వీసాలు మంజూరు చేయబడగా.. 2019 ప్రీ-పాండమిక్ సంవత్సరంలో 3,64,204 తో పోలిస్తే ప్రస్తుత ట్రెండ్ లు ఈ సంఖ్యలు పెరుగుతూనే ఉంటాయని సూచిస్తున్నాయి.

ఇక 2023లో విద్యార్థులకు వీసా జారీ ఎక్కువగా ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు ప్రారంభం నాటికే 3,93,000 ఎఫ్-1 వీసాలు జారీ చేయబడ్డాయి. అయితే, జారీ చేసిన వీసాల పెరుగుదలతో పాటు, తిరస్కరణ రేటు కూడా పెరిగుతుండటం గమనార్హం.

తాజాగా విడుదలైన డేటా ప్రకారం... 2022 ఆర్థిక సంవత్సరానికి 34.9% తిరస్కరణ రేటును చూపుతుండగా... అంతకు ముందు సంవత్సరంలో 19.8% రేటు కంటే ఇది చాలా ఎక్కువ. అయితే యూఎస్ జారీ చేసిన స్టూడెంట్ వీసాల్లో సుమారు 70శాతం ఆసియా విద్యార్థులు, ప్రత్యేకించి ఇండియన్స్ ఉండటం విశేషం.

హైదరాబాద్ లోని కొత్త యూఎస్ కాన్సులేట్ వీసా అపాయింట్మెంట్ ల కోసం విద్యార్థులు విస్తృతంగా ప్రయాణించాల్సిన అవసరాన్ని తగ్గించిందని చెబుతున్నారు. ఫలితంగా బ్లాక్ మార్కెట్ వీసా బుకింగ్ సేవలను తగ్గించడానికి దారితీసిందని అంటున్నారు.

# కాకినాడలో విషాదం

### పందుల్ని కాల్చబోతే పాపకు తగిలిన తూటా



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** కాకినాడ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. నాటు తుపాకీ పేలి నాలుగేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది.

ఈ విషాదం తుని మండలం వెలమ కొత్తూరు గ్రామంలో మంగళవారం జరిగింది. నాలుగేళ్ల చిన్నారి ధన్యశ్రీ ఇంటి సమీపంలో స్నేహితులతో కలిసి ఆడుకుంటోంది. అక్కడే కొందరు వ్యక్తులు నాటు తుపాకులతో పందుల్ని కాలుస్తున్నారు.

ఈ క్రమంలో నాటు తుపాకీతో పందులను కాల్చడానికి ప్రయత్నిస్తుండగా ఓ తుటా గురితప్పి చిన్నారికి తగిలింది. దీంతో ధన్యశ్రీ అక్కడికక్కడే కుప్పకూలింది. వెంటనే స్నేహితులు బాలిక కుటుంబ సభ్యులకు విషయం చేర వేయగా, వారు వచ్చి చిన్నారిని చూసే సరికి అప్పటికే మృతిచెందింది. కూతురి మరణంతో తల్లిదండ్రులు తీవ్రంగా విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## విజయ దుర్గ శక్తీ పీఠంలో వైభవంగా ఆలయ వార్షికోత్సవం



**రావికమతం, (విశాఖ సమాచారమ్):** రావికమతం మండలం ఓమ్మవరం గ్రామం దుర్గమ్మ తోటలో వెంచేసి ఉన్న శ్రీ విజయ దుర్గ అమ్మవారి శక్తీ పీఠం వద్ద ఎనిమిదవ (అష్టమ) వార్షికోత్సవాన్ని మంగళవారం ఆలయ ధర్మకర్త మద్దిపాటి సత్యనారాయణమూర్తి చౌదరి, భాగ్యలక్ష్మి, మరియు దుర్గ వీర వెంకట్ ప్రసాద్, సుష్మ రాజ్యం దంపతులచే వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేపా ధర్మఫణి ఆధ్వర్యంలో వేగుళ్ల దినకర చౌదరి, భారతి దంపతులు చేత ముందుగా గోపూజ జరిగింది. అమ్మవారికి వేకువజామున పంచామృత అభిషేకం అమ్మవారి అలంకరణ నిర్వహించడం జరిగింది. తదుపరి విజయ దుర్గ అమ్మవారి ఆలయంలో విశేష కుంకుమ పూజలు, నవ గ్రహ హోమం, లక్ష్మి గణపతి హోమం, దుర్గ హోమం మరెన్నో హోమాది కార్యక్రమలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో పలు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఓమ్మవరం గ్రామంలో మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి ఉత్సవ విగ్రహంతో ఊరేగింపు జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. నవరాత్రులలో ఉదయం పూట భవాని మాలదారులకు ఉచితంగా అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ ధర్మకర్త చౌదరి తెలిపారు.

## రెపరెపలాడిన మువ్వన్నెల జాతీయ జెండా

యలమంచిలి, (విశాఖ సమాచారమ్): పట్టణంలో మంగళవారం ప్రభుత్వ కార్యాలయాలలో, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎమ్మార్వో, మున్సిపల్ కార్యాలయాల్లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు (కన్నబాబు) పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది త్యాగవీరుల వలనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి, మాజీ డిసిసిబి చైర్మన్ సుకుమార్ వర్మ, ఎమ్మార్వో ఎస్.రాణి అమ్మాజీ, ఎంపీపీ బోదెపు గోవింద్, ఎంపిడిఓ అప్పలనాయుడు, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమీషనర్ కె.వీరయ్య, సర్కిల్ ఇన్స్పెక్టర్ షేక్ గఫూర్, రూరల్ ఎస్సై కె.సన్నిబాబు, పట్టణ అడిషనల్ ఎస్సై కె. వెంకట్రావు, ఎమ్ ఈ ఓ 1,2లైన మీనాక్షి, అరుణ్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్లు అరేపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, కో-అప్షన్ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్య దొర, కొల్లి త్రినాథ్, పిల్లా త్రినాథ్, ఇతర నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, సచివాలయాల సిబ్బంది వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణ, గ్రామీణ పోలీసు స్టేషన్లలో సిఐ గఫూర్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండాను ఎగురవేశారు.

## అనకాపల్లి శ్రీ నూకాంబిక ఆలయ హుండీ ఆదాయం 50 లక్షల 69వేలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పుగా ప్రసిద్ధి చెందిన అనకాపల్లి శ్రీ నూకంబిక అమ్మవారి హుండీ ద్వారా 50 లక్షల 69వేల 97 రూపాయల ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ కార్యనిర్వహణ అధికారి బండారు ప్రసాద్ తెలిపారు. జూన్ ఒకటవ తేదీ నుండి ఆగస్టు 13 వరకు 74 రోజులకు ఈ ఆదాయం లభించినట్టు అయన తెలిపారు. 40 గ్రాముల 500 మిల్లీగ్రాములు బంగారం, ఒక కేజీ 490 గ్రాములు వెండి భక్తుల ముడుపులు మొక్కుబడుల ద్వారా వచ్చిందన్నారు. శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం జింక్ ఏరియా గాజువాక కార్యనిర్వహణ అధికారి పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అర్చకులు, శ్రీవారి సేవా సభ్యులు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా గవరపాలెం బ్రాంచ్ అధికారులు, అనకాపల్లి టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

## హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో వరదల బీభత్సం 54 మంది మృతి



హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఇప్పటి వరకు 54 మంది ప్రాణాలు కోల్పోయారు. మరెంతో మంది నిలువనీడ కోల్పోయారు. కొండచరియలు విరిగిపడడంతో జాతీయ రహదారులపై రవాణా స్తంభించింది. పలు ప్రాంతాల్లో ఇళ్లు ధ్వంసమయ్యాయి. నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మృతి చెందిన 54 మందిలో 51 మంది ఒక్క హిమాచల ప్రదేశ్‌లోనే మృతి చెందడం గమనార్హం.

సిమ్లాలోని సమ్మర్ హిల్ ప్రాంతంలో శివాలయంపై రెండు కొండచరియలు విరిగిపడడంతో 14 మంది భక్తులు చనిపోయారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకుపోయి ఉంటారని భావిస్తున్నారు. సోలాన్‌లో ఒకే కుటుంబంలోని ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలోని 9 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో రూ. 7,171 కోట్ల నష్టం వాటిల్లినట్టు ప్రభుత్వం అంచనా వేసింది. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా స్వాతంత్ర్య వేడుకలకు అంతరాయం ఏర్పడింది.

ఉత్తరాఖండ్‌లోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. ముగ్గురు మరణించగా మరో 10 మంది గల్లంతయ్యారు. కొండచరియలు విరిగిపడడంతో భవనాలు ధ్వంసమయ్యాయి. బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి వెళ్లే రహదారులపై రవాణాకు ఆటంకం ఏర్పడింది. దీంతో చార్‌ధామ్ యాత్రను రెండు రోజులపాటు నిలిపివేశారు.

## ఎఫ్‌వై47 నాటికి తలసరి ఆదాయం రూ.2 లక్షల నుండి రూ.14.9 లక్షలకు పెరుగుదల



2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షలుగా ఉన్న తలసరి ఆదాయం దాదాపు 25 ఏళ్ల తర్వాత అంటే 2046-47 ఆర్థిక సంవత్సరానికి ఏడున్నర రెట్లు పెరిగి రూ.14.9 లక్షలకు చేరుకుంటుందని ఎస్బీఐ రీసెర్చ్ పేర్కొంది. ఇటీవల ఐటీఆర్ ఫైలింగ్ పెరుగుదల ఆధారంగా అంచనా వేసింది. ఐటీఆర్ ఫైలింగ్ ఆధారంగా అసెస్‌మెంట్ ఇయర్ 14లో సగటు ఆదాయం రూ.4.4 లక్షలు కాగా, ఇప్పుడు రూ.13 లక్షలకు పెరిగినట్లు తెలిపింది. ఇది 2047 నాటికి రూ.49.7 లక్షలకు పెరుగుతుందని అంచనా వేసింది. సగటు ఆదాయం క్రమంగా పెరుగుతున్నట్లు వెల్లడించింది.

ఎవై12తో పోలిస్తే ప్రస్తుతం పన్ను చెల్లింపుదారులలో 13.6 శాతం మంది తక్కువ ఆదాయ పన్ను పరిమితి నుండి అప్‌గ్రేడ్ అయినట్లు తెలిపింది. అసెస్‌మెంట్ ఇయర్ 2023లో 68.5 మిలియన్ల మంది ఐటిఆర్‌ను దాఖలు చేయగా, వీరు రూ.5 లక్షల వరకు ఆదాయ సమూహంలో ఉన్నారు. రూ.5 లక్షల ఆదాయపు పన్ను పరిమితికి ఈసారి 8.1 శాతం పెరగగా, రూ.10-20 లక్షల ఆదాయపు పన్ను పరిమితిలోకి 3.8 శాతం ఐటీఆర్‌లు పెరిగాయి. రూ.20-50 లక్షల ఆదాయ సమూహంలో 1.5 శాతం, రూ.50 లక్షల నుండి రూ.1 కోట్ల ఆదాయ సమూహంలో 0.2 శాతం పెరిగినట్లు తెలిపింది.

2046-47 ఆర్థిక సంవత్సరం నాటికి 25 శాతం మంది ఐటీఆర్ ఫైలర్లు అత్యల్ప ఆదాయ గ్రూప్ నుండి అప్‌గ్రేడ్ అవుతారని అంచనా వేసింది. ఇందులో 17.5 శాతం మంది ఫైలర్లు రూ.5-10 లక్షల ఆదాయపు పన్ను పరిమితికి, 5 శాతం మంది రూ. 10-20 లక్షలకు, 3 శాతం మంది రూ. 20-50 లక్షల పరిమితికి పెరగనున్నట్లు తెలిపింది. ఎఫ్‌వై47 నాటికి ఫైలర్లలో 0.5 శాతం మంది రూ.50 లక్షలు - రూ.1 కోటి ఆదాయ వర్గానికి, 0.075 శాతం మంది రూ.1 కోటి కంటే అధిక ఆదాయ వర్గానికి మారుతారని అంచనా వేసింది.

ఎఫ్‌వై47 నాటికి భారత జనాభా ప్రస్తుతం ఉన్న 1.4 బిలియన్ల నుండి 1.6 బిలియన్లకు పెరుగుతుందని అంచనా వేసింది. అదే సమయంలో, శ్రామిక శక్తి ఎఫ్‌వై23లో 530 మిలియన్ల నుండి ఎఫ్‌వై47లో 725 మిలియన్లకు పెరగవచ్చునని ఎఫ్‌వై23లో ఐటీఆర్ ఫైలర్లు 70 మిలియన్ల నుండి ఎఫ్‌వై47లో 482 మిలియన్లకు పెరుగుతారని అంచనా వేసింది. ఎవై23లో దాఖలైన ఐటీ రిటర్న్‌లో 48 శాతం మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి.

## గిరిజన ప్రాంతాలలో ఆసరా సేవలు ప్రారంభించడం అభినందనీయం




అరకులోయ, (విశాఖ సమాచారమ్): జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వినియోగదారులకు హక్కులు చట్టాలు న్యాయ సమస్యలపై కల్పిస్తూ పరిష్కార మార్గం చూపిస్తున్న ఆసరా గిరిజన ప్రాంతాలలో సేవలు ప్రారంభించాలని సంకల్పించడం అభినందనీయమని అరకు లోయ శాసనసభ్యులు శెట్టి ఫల్గుణ అన్నారు. అడ్వకేట్ అసోసియేషన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అవేర్నెస్ ఆసరా ఆధ్వర్యంలో పద్మాపురం పంచాయతీ రన్న జిల్లాడ గ్రామ సమీపంలో ఓ ప్రైవేట్ రిసార్ట్స్ వద్ద మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శెట్టి ఫల్గుణ ఆసరా సేవలను అభినందిస్తూనే మన్య ప్రాంతంలో కూడా సేవలు అందించాలని సంకల్పించడం సంతోష దాయకమన్నారు. ఎటువంటి అవగాహన లేకుండా అన్ని విధాలుగా నష్టపోతున్న వినియోగదారులకు సామాజిక పరంగా, న్యాయపరంగా లబ్ధిని చేకూర్చడమే కాకుండా వారిని చైతన్యవంతం చేస్తున్న ఆసరా నిర్వాహకులు అభినందనీయులని ఎమ్మెల్యే ప్రశంసించారు. ఆసరా సేవలను పాడేరు డివిజన్ వ్యాప్తంగా విస్తరించాలని ఆయన కోరారు. అంతకుముందు ఆసరా, ఆర్‌ఆర్‌టీ టీం ప్రధాన ప్రతినిధులు డాక్టర్ ఆర్ రతన్ రాజ్, హబీబ్ సుల్తాన్ ఆలీ మాట్లాడుతూ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఆసరా ఫౌండేషన్ వినియోగదారులను చైతన్య పరుస్తూ వారి హక్కులు చట్టాలు పరిరక్షిస్తూ న్యాయ సలహాలు అందిస్తూ అనేక సమస్యలపై న్యాయం అందించడం జరిగిందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఆసరా సేవలను స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గిరిజన ప్రాంతాల్లో ప్రారంభించాలని అరకు లోయలో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

## మాజీ సైనికులను సన్మానించిన జెఎన్‌టియుకె




కాకినాడ, (విశాఖ సమాచారమ్): జెఎన్‌టియుకె ప్రాంగణంలో మంగళవారం ఉదయం 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. గౌరవనీయులైన ఉపకులపతి ప్రొ.జివిఆర్. ప్రసాదరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ జెండాను ఆవిష్కరించి ఎన్‌సిసి క్యాడెట్ లు మరియు ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లచే గౌరవ వందనం స్వీకరించారు.

ఈ నేపథ్యంలో ఉపకులపతి ప్రొ.జివిఆర్. ప్రసాదరాజు మాట్లాడుతూ ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు మనకు స్వేచ్ఛను అందించడానికి తమ జీవితాలను త్యాగం చేశారన్నారు. జెఎన్‌టియుకెలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు తగిన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థులు ముఖ్యంగా విద్యకు ప్రాధాన్యతనిచ్చి సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలన్నారు. ఈ ఏడాది జెఎన్‌టియుకె 9వ స్నాతకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించామని, అదేవిధంగా జెఎన్‌టియుకె యూనివర్శిటీకి న్యాక్ ఏ+ గ్రేడ్ లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. యుసిఇకెలోని ఐదు యుజి కోర్సులకు ఎన్‌బిఏ గుర్తింపు లభించిందని, త్వరలో పిజి కోర్సులకు కూడా ఎన్‌బిఏ గుర్తింపు రానుందన్నారు. జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా నూతన సాంకేతిక అంశాలకు ప్రాధాన్యతనిస్తూ జెఎన్‌టియుకెలో బీటెక్ సిఎస్ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ & మెషిన్ లెర్నింగ్ (ఏఐ & ఎంఎల్), ఎమ్మెస్సీ డేటా సైన్స్, ఎంబిఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సులను ప్రారంభిస్తున్నామన్నారు.


రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యం లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న అసిస్టెట్ ప్రొఫెసర్‌ల భర్తీ ప్రక్రియ త్వరలో ప్రారంభమవుతుందని, జెఎన్‌టి యుకె సిఏఎస్ ద్వారా అధ్యాపకులకు ప్రమోషన్‌లు చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం వసతి, మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగు తుందన్నారు. అదేవిధంగా విదేశీ విశ్వవిద్యాలయాలతో ఎంఓయు.లు కుదుర్చు కుని ఆధునిక మరియు వినూత్న కోర్సులలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. జెఎన్‌టియుకె యూని వర్శిటీలో చలమలశెట్టి ఫౌండేషన్ మరియు జెఎన్‌కో సంస్థలతో కలిసి ఆర్నమెంటల్ ట్రీస్, యోగా సెంటర్, ఓపెన్ జిమ్, ఓపెన్ థియేటర్, పార్క్‌లతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. జెఎన్‌టి యుకెలో చేపట్టిన డ్రైనేజీ మరియు రహదారుల నిర్మాణం పనులు త్వరలో పూర్తికానున్నాయన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే ఐదవ ఆర్థిక శక్తిగా అవతరించడం జరిగిందని, ప్రపంచ సంక్షేమానికి భారతదేశం బలమైన పునాదులు వేస్తోందన్నారు. రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యా బోధన అందించేందుకు రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు వైఎస్. జగన్మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

జెఎన్‌టియుకె ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేట ర్ మరియు యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డా.జి.శ్యామ్ కుమార్ స్వాతం త్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అనంతరం జెఎన్‌టియుకె ఎన్‌ఎస్‌-ఎస్ విభాగం వారి ఆధ్వర్యంలో దేశ స్వాతంత్ర్యం కోసం మరియు దేశ రక్షణ కోసం అమరులైన అమరవీరుల కుటుంబీకులను, మాజీ సైనికులను ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు సత్కరించి వారి సేవలను కొనియాడారు. గౌరవనీయులైన ఉపకులపతి ప్రొ.జివి ఆర్. ప్రసాదరాజు ప్రసంగం తర్వాత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరింప జేశాయి.

ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ.కెవి.రమణ, రిజిస్ట్రార్ ప్రొ.ఎల్. సుమలత, ఓఎస్‌డి ప్రొ.డి.కోటేశ్వరరావు, డైరెక్టర్‌లు, స్పెషల్ ఆఫీసర్‌లు, యుసిఇకె ప్రిన్సిపాల్, యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాప కులు, ఫిజికల్ డైరెక్టర్‌లు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్‌సిసి క్యాడెట్స్, ఎన్‌ఎస్‌-ఎస్ వాలంటీర్లు, జెఎన్‌టియుకె మరియు అనుబంధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యాలయాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



యలమంచిలి, (విశాఖ సమాచారమ్): 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం నాడు వైసిపి, జనసేన, టిడిపి, బిజెపి పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. నియోజకవర్గ కేంద్రమైన యలమంచిలి వైసిపి కార్యాలయంలో శాసనసభ్యులు యువి రమణమూర్తి రాజు (కన్నబాబు), టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ మాజీ పార్లమెంటు సభ్యులు పప్పల చలపతిరావు జాతీయ జెండాను ఎగురవేయగా, రాంబిల్లి మండలం హరిపురంలో గల జనసేన నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుందరపు విజయ్ కుమార్, టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్యక్షులు వసంతవాడ దిన్ బాబు, రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదే విధంగా రాంబిల్లి మండలం వాడ నరసాపురంలో భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కోర్ట్ ఆవరణలో న్యాయమూర్తులు పాల్గొని జండా ఆవిష్కరణ చేశారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ప్రదీపా, రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ విజయలక్ష్మి జండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి గంగరాజు మాట్లాడుతూ బ్రిటిష్ వారి బానిస సంకెళ్ల నుంచి స్వాతంత్రము సాధించుకోవడం ఎందరో త్యాగమూర్తుల త్యాగాల ఫలితం అన్నారు. రాజ్యాంగానికి అనుకూలంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలనీ, చట్టాలను గౌరవించాలనీ అన్నారు. స్వతంత్రదినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాయి లక్ష్మణ్, సెక్రటరీ సురా శ్రీను, ఉపాధ్యక్షులు రమణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు సాయిరాం, రామచంద్రరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



కాకినాడ, (విశాఖ సమాచారమ్): 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని 100 అడుగుల జాతీయ జెండాను కలెక్టర్ డా. కృతికా శుక్లా మీట నొక్కి ఎగుర వేశారు. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టరు ఎస్. ఇలక్కియ, జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీధర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ ఆధునికీకరణ పనులను కలెక్టర్, జేసీ, డీఆర్వో, ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం డి.పుష్పమణి, ఏడీ సర్వే బి.లక్ష్మి నారాయణ, వికాస పీడీ కె.లచ్చారావు, కలెక్టరేట్ ఏవో జీఎస్‌ఎస్ శ్రీనివాసు, వివిధ విభాగాల అధిపతులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో జాతీయ పతాకం ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవం లో జిల్లా కలెక్టర్ రవి పట్ట శెట్టి జాతీయ పతాకం ఆవిష్కరించారు. కలెక్టర్ కార్యాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాల తో అలంకరిం చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ రాజ్, డిఆర్ఓ అనిత, సిపిఓ జి.రామారావు, కలెక్టరేట్ ఏవో ఏ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లిలో వైభవంగా 77 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): జిల్లా కేంద్రం ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం 77 వ స్వాతంత్ర దినోత్సవాలు వైభవంగా జరిగాయి. జిల్లా ఇన్చార్జి మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను త్రుణపాయంగా భావించి ఆంగ్లేయులకు పరిపాలన నుంచి భరతమాతరం విముక్తి చేసేందుకు పోరాటం సాగించారన్నారు. వారు చేసిన త్యాగాలు పోరాటాల ఫలితంగా మన దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం లభించిందని దేశ వ్యాప్తంగా మువ్వన్నెల జెండా రెపరెపలు జాతీయ గీతా లాపనలు భారతీయతతో వెలుగుతున్న ఘడియలు రోజునే మొదలయ్యాయన్నారు. గౌరవ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారి అద్భుత పాలనలో జిల్లాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని దీనిలో భాగంగా మన జిల్లాలో అమలవుతున్న పథకాలు, వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిని వివరించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి నృత్యాలు అందరి ప్రశంసలు అందుకున్నాయి. అనంతరం పశుసంవర్ధక, మత్స్య, గృహ నిర్మాణ, వ్యవసాయ, గ్రామీణ, అభివృద్ధి విద్య స్త్రీ శిశు సంక్షేమ ఎస్సీ ఎస్ టి బి సి సంక్షేమ ఉపాధి హామీ నీటి సరఫరా వైద్య స్వచ్ఛ సర్వేక్షన్ (జీవీఎంసీ) గ్రామపంచాయతీ దేవాదాయ శాఖల శకటాలు, అగ్నిమాపక శాఖ వారి



ప్రదర్శనలు అందరిని అబ్బురపరిచాయి. అదేవిధంగా వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ అలరించాయి. అనంతరం అత్యుత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులకు, పోలీసు అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులకు మంత్రి ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రదర్శించిన శకటాలలో ప్రథమ స్థానంలో వైద్య ఆరోగ్య శాఖ నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాలలో విద్యాశాఖ, పశుసంవర్ధక మత్స్య శాఖలు నిలిచాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, పోలీసు సూపరింటెండెంట్ మురళీకృష్ణ, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్ రాజ్, డిఆర్ఓ అనిత, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు ప్రశంసలు



యలమంచిలి, (విశాఖ సమాచారమ్): విధులలో ఉత్తమ సేవలకు గాను పలువురు అధికారులకు 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పురస్కారాలు లభించాయి.ఈ సందర్భంగా యలమంచిలి మున్సిపాలిటీలో ఇంచార్జ్ కమీషనర్ గా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వీరయ్యను ఉత్తమ ఇంజనీరింగ్ అధికారిగా ప్రకటించడంతో మంగళవారం నాడు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా అనకాపల్లి జిల్లా ఇంచార్జ్ మంత్రి పీడిక రాజన్న దొర చేతుల మీదుగా ప్రశంసా పత్రం స్వీకరించారు.అదే విధంగా యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు కూడా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కె.వీరయ్య, నాగరాజుకు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. తమకు ఉత్తమ అధికారులుగా అవార్డు రావడానికి కారణమైన సిబ్బందికి, ప్రజానీకానికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఉపముఖ్యమంత్రి చేతుల మీదుగా పోలీసులకు సేవా పతకాలు, ప్రశంస పత్రాలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): విశాఖపట్నం రేంజ్ కార్యాలయంలో డి ఐ జి ఎస్. హరికృష్ణ (విశాఖపట్నం రేంజ్ ) 77వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ చేసి గౌరవవందనం చేశారు.జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయం ఎస్పీ క్యాంప్ ఆఫీస్ నందు జాతీయ పతాకావిష్కరణ చేసి గౌరవ వందనం చేశారు.పోలీస్ అధికారులు, సిబ్బంది స్వాతంత్ర్య దినోత్సవం శుభాకాంక్షలు పరస్పరం తెలుపుకున్నారు. స్వాతంత్ర్య కోసం ప్రాణత్యాగం చేసిన సమరయోధులను గుర్తు చేసుకొని వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని, దేశభక్తి భావాన్ని చాటుతూ భావితరాలు ఆదిశగా నడిచేలా సమిష్టిగా కృషి చేద్దాం అన్నారు.

అనంతరం అనకాపల్లి, ఎన్టీఆర్ స్టేడియం పెరేడ్ గ్రౌండ్లో జిల్లా కలెక్టరు శ్రీ రవి పట్టన్ శెట్టి ఐఏఎస్ వారి ఆధ్వర్యంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పాల్గొన్నారు.అనకాపల్లి ఎన్.టి.ఆర్ స్టేడియం మైదానం లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులు పెరేడ్ కమాండర్ ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు సారథ్యంలో జాతీయ పతాక ఆవిష్కరణ చేసిన గౌరవ ఉప ముఖ్యమంత్రి పి.రాజన్న దొర తోపాటు జిల్లా కలెక్టర్, ఎస్పీ లు గౌరవ వందనం చేశారు.

పోలీసు శాఖలో ప్రతిభావంతులకు సేవా పతకాలు ప్రధానం చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పి.రాజన్నదొర చేతుల మీదుగా ప్రధానం జరిగింది

అనకాపల్లి జిల్లా పోలీసు శాఖలో ప్రతిభావంతంగా పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం - 2022 గాను మరియు ఉగాదికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పతకాలు.ఆర్మ్డ్ రిజర్వ్ ఏ.ఆర్ ఎస్సై ఎస్.వి.ఆర్. పాత్రుడు - ఉత్తమ సేవా పతకం,

గొలుగొండ ఎస్సై ఎం.నారాయణరావు, ఏ.ఆర్ ఎస్సై టి.అప్పారావు, ఏ.ఆర్ పిసి ఎస్.కేశవరావు, డి.టి.సి హెచ్.సి పి.వి.రమణమూర్తి, చీడికాడ హెచ్.సిజి.ధనరాజు, ఏ.ఆర్ పిసి పి.చిన్నబాబు లకు సేవా పతకాలను 77వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పి.రాజన్న దొర చేతుల మీదుగా ప్రధానం చేసారు.

పోలీసు శాఖలో ప్రతిష్టాత్మకంగా భావించే పతకాలు పొందిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కె.వి. మురళీకృష్ణ ఇతర పోలీసు అధికారులు అభినందించి, భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో పని చేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అభిలషించారు. ఉప ముఖ్యమంత్రి పి.రాజన్న దొర చేతుల మీదుగా జిల్లా కలెక్టరు ప్రశంసా పత్రాలు పోలీసు విధులలో ప్రతిభ కనబరిచిన 57 మంది జిల్లా పోలీసులకు ఎస్పీ మరియు జిల్లా కలెక్టరు సమక్షంలో అనకాపల్లి జిల్లా పోలీసులు అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, అదనపు ఎస్పీ (క్రైమ్స్) పి.సత్యనారాయణ రావు, నర్సీపట్నం సబ్ డివిజన్ అదనపు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఐపీఎస్., అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ వి.సుబ్బరాజు, ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ఆర్మ్డ్ రిజర్వు డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, లక్ష్మణ్ మూర్తి, పైడపు నాయుడు, అప్పలనాయుడు, రామకృష్ణారావు, సతీష్ , వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15న కూడా యథేచ్ఛగా మాంసాహార విక్రయాలు



యలమంచిలి, (విశాఖ సమాచారమ్): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆరోజున ఎటువంటి మాంస విక్రయాలు జరపకూడదని ఒకవేళ విక్రయాలు జరిపినట్లయితే జరిమానా కూడా విధిస్తారని అందరికీ తెలిసిన విషయమే.యలమంచిలి పట్టణంలో మటుకు మంగళవారం నాడు ఆ నిబంధనలను పట్టించుకోకుండా ఆర్టీసీ కాంప్లెక్స్, మార్కెట్, దిమిలి రోడ్ ఇంకా పలుచోట్ల వద్ద చేపలతో పాటుగా కోడిమాంసం విక్రయాలు యధేచ్ఛగా జరిపినప్పటికి ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. దేశం మీద గౌరవంతో అటు ప్రజలు కూడా నిబంధనలను పాటించ కుండా మాంసాహారాన్ని కొనుగోలు చేయడం పట్ల పలువురు దేశాభిమానులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.సంభంధిత అధికారులు ఒకరోజు ముందుగానే సర్క్యులర్ జారీ చేసి ఆగస్టు 15న మాంసాహార విక్రయాలు జరపకూడదు, ఒకవేళ మాంసం విక్రయిస్తే జరిమానా విధిస్తామని అమ్మకపు దారులకు తెలియపరిస్తే అమ్మకాలు, కొనుగోళ్ల జరిగేవి కావేమోనని పలువురు గుసగుసలాడుకున్నారు.

## పట్టణంలో ఘనంగా 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పట్టణ ప్రజలు అత్యంత ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ డిప్యూటీ తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. స్థానిక రింగ్ రోడ్ లో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావులు ప్రాణత్యాగం చేసి స్వరాజ్యాన్ని సముపార్జించారని,ఆ మహానుభావులను ఎల్లప్పుడు స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన నాటి పరిపాలన గుర్తిస్తుంది అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. గవరపాలెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ శాసనసభ్యుడు పీలా గోవింద సత్యనారాయణ జాతీయ జెండా ఎగురవేశారు, స్థానిక రింగ్ రోడ్ లో ఉన్న డివిఆర్ కార్యాలయంలో, డైట్ కళాశాలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. మూలపేట భవన నిర్మాణ కార్మికుల కార్యాలయం వద్ద స్వాతంత్ర దినోత్సవ వేడుకలుఘనంగా జరిగాయి. ఏఐటీయూసీ నాయకుడు కోన లక్ష్మణ్ జాతీయ జెండా ఆవిష్కరించారు. స్థానిక ప్రశాంతి నికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో కరస్పాండెంట్ డివి శ్రీనివాసరావు జాతీయ ప్రతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో డి చంద్రశేఖర్, పాఠశాల ప్రిన్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, పాఠశాలలలోనూ ప్రజాప్రతినిధుల కార్యాలయాల్లోనూ మువ్వన్నెల జెండా రెపరెపలాడింది.

## ఎన్ టీ పి సి లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



పరవాడ, (విశాఖ సమాచారమ్): పరవాడ ఎన్టిపిసి సింహాద్రి సదన క్రీడా మైదాన్‌లో మంగళవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థ సీజీఎం సంజయ్ కుమార్ సిన్హా జాతీయ జెండాను ఎగురవేశారు.

ఈ సందర్భంగా హెచ్ఓపీ మాట్లాడుతూ దేశ నిర్మాణానికి స్వాతంత్ర్య సమరయోధుల కృషి గురించి వివరించారు. ప్రాజెక్ట్ సాధించిన వారికి పవర్ ఎక్సెల్ అవార్డ్‌లు %ఉ% జిజిఎం మెరిటోరియస్ అవార్డులు అందించడం ద్వారా వారి సంబంధిత పని ప్రాంతాలలో వారి విశిష్ట సహకారం అందించడం ద్వారా వారిని సత్కరించారు.ప్రాజెక్ట్ హెడ్ సంజయ్ కుమార్ సిన్హా, సీసీఎం విపిజ బి రామారావు , సీజీఎ సిపిజి గోవింద రాజన్, జి ఎం ఓ ఎం ఎం పి పాత్ర , హెచ్ ఆర్ హెడ్ రుమా డి శర్మ మరియు డిప్యూటీ కమాండర్, సిఐఎస్ఎఫ్ విజేతలందరినీ అభినందించారు మరియు ఉన్నత స్థాయికి చేరుకునేలా వారిని ప్రోత్సహించారు.

## జాతీయ జెండాను ఎగురవేసిన మాజీ ఎంపీ



యలమంచిలి, (విశాఖ సమాచారమ్): ఎలమంచిలి టిడిపి కార్యాలయం వద్ద మాజీ ఎంపీ ఆ పార్టీ నాయకుడు పప్పల చలపతిరావు జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం కోసం జీవితాలను త్యాగం చేసిన మహనీయులు చూపిన బాటలో నడవాలని అన్నారు. మహనీయుల త్యాగాల వల్లే స్వేచ్ఛ వాయువులు పీల్చుకుంటున్నామన్నారు. శాంతియుత మార్గంలో స్వరాజ్యాన్ని తీసుకొచ్చిన గాంధీజీ మనందరికీ ఆదర్శనీయుడని అన్నారు.

## దేశ నాయకుల చరిత్ర, సంస్కృతి పిల్లలకు బోధించాలి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): దేశ నాయకుల చరిత్ర, సంస్కృతి పిల్లలకు బోధించాలని సి బీ ఐ మాజీ జే డి వివి లక్ష్మి నారాయణ సూచించారు.

తల్లి దండ్రులు గర్వించేలా పిల్లలు లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మంగళవారం ఎంవిపి కాలనీలో గల కిడ్స్ గార్డెన్ పబ్లిక్ స్కూల్ లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పలు పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో నాయకుల త్యాగ ఫలమే స్వాతంత్ర్యం అని అన్నారు.

భగత్ సింగ్,రాజ్ గురు, చంద్ర బోస్ అల్లూరి వంటి మహనీయులు అడుగు జాడల్లో నడవాలని సూచించారు. గాంధీ సత్యాగ్రహం, అహింస తో స్వాతంత్ర్యం సాధించారని పేర్కొన్నారు. సైనికులు, శాస్త్ర వేత్తలు కూడా దేశ భక్తులే అన్నారు. విద్యార్థులు దేశభక్తి పెంపొందించు కోవాలి అన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలకు మంచి నడవడిక బోధించాలని అన్నారు. బ్రిటిష్ మాదిరిగానే పాలకులు ప్రజలను కులం, మతం పేరిట విభజించి పాలించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు అని విచారం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి లక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అత్యధిక వచ్చి విద్యార్థులను ఆశీర్వదించిన జెడి లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. తమ స్కూలు విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు అలాగే సాంస్కృతిక రంగాలలోనూ రాణిస్తున్నారని కొనియాడారు. పలు పోటీలలో పాల్గొని ఎన్నో అవార్డులను సాధించారని చెప్పారు. భవిష్యత్తు అంతా విద్యార్థులదేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'సులభ్ ఇంటర్నేషనల్' బిందేశ్వర్ పాఠక్ మృతి



సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాఠక్ (80) మంగళవారం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో గుండె పోటుతో తుది శ్వాస విడిచారు. ఆయన పరిశుభ్రత, సామాజిక సంస్కరణోద్యమ వ్యవస్థాపకుడు. బహిరంగ మలమూత్ర విసర్జనకు వ్యతిరేకంగా పోరాడారు. కమ్యూనిటీ పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి కృషి చేశారు. బిందేశ్వర్ పాఠక్‌కు చెందిన సులభ్ ఇంటర్నేషనల్ దేశవ్యాప్తంగా 1.3 మిలియన్ల హౌస్ హోల్డ్ టాయిలెట్లు, 54 మిలియన్ ప్రభుత్వ టాయిలెట్లను సరికొత్తగా నిర్మించింది.

పాఠక్ 1970లో సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు 50,000 మంది వాలంటీర్లు ఉన్నారు. ఇండియన్ రైల్వేస్‌కు చెందిన రైల్ మిషన్‌కు బిందేశ్వర్ పాఠక్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు. ఈయన పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు. భారత మూడో అతిపెద్ద అవార్డ్ పద్మ భూషణ్‌ను అందుకున్నారు. ఏప్రిల్ 14ను బిందేశ్వర్ పాఠక్ డేగా న్యూయార్క్ సిటీ ప్రకటించడం గమనార్హం.

# ఏపీ ట్రిపుల్ఐటీ మూడో విడత కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల




**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2023-29 విద్యాసంవత్సరానికి ఆరేళ్ల బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి మూడో విడత (ఫేజ్-3) షెడ్యూల్ విడుదలైంది. ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి మొత్తం 4,400 సీట్లు అందుబాటులో ఉండగా.. మొదటి విడతలో 38,355 మంది దరఖాస్తు చేశారు. మొదటి విడతలో మిగిలిపోయిన 829 సీట్లరే ఆగస్టు 9, 10 తేదీల్లో నూజివీడు ట్రిపుల్ఐటీలో రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించారు. రెండో విడత పూర్తయిన తర్వాత నాలుగు క్యాంపస్‌లలో 294 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆర్టీయూకేటీ. మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఆగస్టు 23, 27 తేదీల్లో నూజివీడు ట్రిపుల్ఐటీలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆర్టీయూకేటీ పేర్కొంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను తాజాగా విడుదల చేసింది. అలాగే ఇప్పటి వరకు సీట్లు పొందిన వారు క్యాంపస్‌ల మార్పుకు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి కూడా అవకాశం కల్పించారు. మూడో విడత కౌన్సెలింగ్‌కు ఆగస్టు 16లోగా దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. అలాగు క్యాంపస్ మార్పునకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

# 11వ వార్డులో ఘనంగా 77వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈరోజు 77వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి వారి సూచన మేరకు తూర్పు నియోజకవర్గం కన్వీనర్ మురళీమోహన్ రాజు సలహా మేరకు ఆరిలోవ అంబేద్కర్ బొమ్మ కూడలి నందు విశాఖ జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు తెడ్లపు అప్పారావు జిల్లా కిషన్ మోర్చా ప్రధాన కార్యదర్శి లెంక శ్రీరామ్ ఆరిలోవ మండల అధ్యక్షులు మధుపాడ సన్యాసిరావు 11వ వార్డు అధ్యక్షులు గుంపిన వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి కనుమూరు బ్రహ్మానందం మరియు 12వ అధ్యక్షులు ఎమ్ .వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆరిలోవ లో మొట్టమొదటి సారిగా బిజెపి పార్టీ తరపున స్వాతంత్ర దినోత్సవ వేడుక జరపడం జరిగింది ఈ కార్యక్రమంనకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర యువమోర్చా అధ్యక్షులు తూర్పు నియోజకవర్గం ఇంచార్జ్ శ్రీ కేతినేని సురేంద్రమోహన్ గారు హాజరవ్వడం జాతీయ పతాకం ఆవిష్కరిం చి జెండా వందనం చేశారు ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం కన్వీనర్ మురళీమోహన్ రాజుగారు నాయకులు మరియు కార్యకర్తలు హాజరవ్వడం జరిగింది

# కొందరు స్వార్ధపరుల వల్లే దేశ విభజన



దేశవ్యాప్తంగా స్వాతంత్ర సంబరాలు మిన్నంటున్న వేళ ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దేశ విభజన నాటి పరిస్థితుల్ని గుర్తుచేసుకున్నారు. విభజన గాయాల సంస్మరణ దినంలో పాల్గొన్న యోగి అప్పటి పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు. కొందరి స్వార్థం వల్లే దేశ విభజన విషాదం చోటు చేసుకుందని యోగి తెలిపారు. దీనికి దేశం ఆ తర్వాత మూల్యం చెల్లించుకుందన్నారు. దీంతో యోగీ వ్యాఖ్యలు చర్చనీయాంశమవుతున్నాయి.

అప్పట్లో దేశ విభజన జరగకపోయి ఉంటే భారతదేశం త్వరగా సూపర్ పవర్ అయ్యేదని యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. దేశ విభజనకు కొద్దిమంది స్వార్థమే కారణమని యోగి ఆక్షేపించారు. విభజన భయాందోళనల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని యూపీలోని ఇందిరా గాంధీ ప్రతిష్టాన్‌లో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ఈ తేదీ మాకు కొత్త స్ఫూర్తిని ఇస్తుందన్నారు. చరిత్రలో ఆ విషాదకరమైన క్షణాల నుండి కొన్ని పాఠాలు నేర్చుకోవడానికి ఇది స్ఫూర్తినిస్తుందన్నారు.

చరిత్రను మరచి ఏ సమాజమూ ముందుకు సాగదని యూపీ సీఎం యోగి గుర్తుచేశారు. అందుకే వ్యక్తిగత ఆసక్తి, కుటుంబం, కులం, అభిప్రాయం, మతం, ప్రాంతం, భాష దేశానికి అతీతంగా ఉండకూడదనేది మన తీర్మానమన్నారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశం అవిభాజ్య స్థితిలో ఉండి ఉంటే, ఈ రోజు ప్రపంచానికి అగ్రరాజ్యంగా మారడానికి ఎంతో కాలం పట్టేది కాదని యోగీ తెలిపారు.

కొందరి స్వార్థం దేశాన్ని విభజన విషాదంలోకి నెట్టిందని, ఇది భూమి విభజన కాదని, రెండు హృదయాల విభజన అని యోగీ ఆదిత్యనాథ్ అన్నారు. వారు లక్షలాది మంది ప్రాణాలను బలిగొన్నారని తెలిపారు. పాకిస్తాన్ చరిత్ర నుండి నేర్చుకోలేదని, ఈ రోజు దాని దుస్థితి ఎవరి నుండి దాచబడలేదన్నారు. 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశం కుల వివక్షను తొలగించి ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ సందేశంతో ముందుకు సాగుతుందని యోగీ తెలిపారు. విభజన యొక్క భయానక పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ దేశంలో మతం, మతం, ఉత్తరం, దక్షిణం, తూర్పు, పడమర వంటి అడ్డుగోడలు తొలగించామన్నారు.

# మణి భూషణ్ సేవలకు గుర్తింపు ప్రజాపిత బ్రహ్మ బాబా బయోపిక్ వరల్డ్ ప్రీమియర్ లో ఘన సన్మానం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంస్థ అంగరంగ వైభవంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు స్థానిక గదిరాజు పాలస్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అతిథిగా విచ్చేసిన డాక్టర్ మణి భూషణ్ గారికి మరియు ముఖ్య అతిధి శ్రీ శ్రీనివాస్ పాణికి ప్రజాపిత బ్రహ్మ బాబా జీవిత చరిత్రను సంగీత నేపథ్యం లో తెరకెక్కించిన ప్రముఖ టాలీవుడ్ డైరెక్టర్ ముప్పలనేని శివగారు మరియు మౌంట్ అబూ నుండి విచ్చేసిన బ్రహ్మ కుమారులు శ్రీ కరుణ భాయ్ జి గారి చేతుల మీదుగా ఘన సత్కారం చేసి పర్యాటక రంగ సేవలను కొనియాడారు . ఈ సందర్భంగా బాబా గారి చిత్రాన్ని ప్రీమియర్ షో వేలాదిమంది వీక్షించారు దర్శకుడు ముప్పలనేని శివ మరియు నటీనటులకు శుభ అశీసులతో సన్మానం చేసారు . ఈ సందర్భంగా దర్శకుడు మణి భూషణ్ మాట్లాడుతూ సనాతన ధర్మ స్థాపనకు దేవుడు మానవ రూపంలో వస్తాడని ఈ కలియుగం లో ప్రపంచ మానవాళి కి ఈశ్వరీయ శక్తి ని అందించేందుకు బ్రహ్మబాబా జన్మించారని వారి జీవితం ఒక స్ఫూర్తినింపిన వెలుగు కిరణం అని అందరు ఆ వెలుగులో జన్మ సార్ధకత చేసుకోవాలని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ అందుకు చిరునామా అని పిలుపునిచ్చారు. చిత్ర దర్శకుడు ముప్పలనేని శివ గారికి అభినందనలు తెలియజెసారు. ఈ కార్యక్రమం లో వేలాదిమంది బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు హాజరయ్యారు

# ఉపముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నడి పి ఆర్ ఓ సాయిబాబా




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** 77వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో అనకాపల్లి జిల్లా డిపిఆర్ఓ సాయిబాబా ఉత్తమ సేవలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి, ఎస్పీ కే మురళీకృష్ణ డిప్యూటీ కలెక్టర్ జాహ్నవి తదితరులు పాల్గొన్నారు

# మహాత్ముల సేవలు మహనీయం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భారత స్వాతంత్ర పోరాటంలో ఎంతో మంది మహాత్ములు అందించిన సేవలు మహనీయమని నేవల్ డాక్ యార్డ్ ఉద్యోగుల కేటీబి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు కొనియాడారు. ఇక్కడ కాకాని నగర్ లో ఉన్న డాక్ యార్డ్ కేటీబి కళాక్షేత్రంలో మంగళవారం 77 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. తొలుత ముఖ్య అతిథిగా హాజరైన గంట్ల శ్రీను బాబు చేతుల మీదుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ. ఎంతోమంది త్యాగమూర్తుల పోరాటపటిమ వల్లే భారతదేశానికి స్వాతంత్ర ఫలాలు సిద్ధించాయన్నారు.దేశ రక్షణలో డాక్ యార్డ్ ఉద్యోగులు, రక్షణ రంగ అధికారులు ,అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని శ్రీను బాబు కొనియాడారు. కార్యక్రమంలో స్వాతంత్ర సమరయోధులకు ఘనంగా నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షులు బత్తుల చిరంజీవి,కార్యదర్శి భాస్కర్ రావు,. కార్యవర్గ ప్రతినిధులు తేజ, రమణ ,సన్యాసిరావుతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు. తొలుత పలువురు దేశభక్తి గీతాలు ఆలపించారు

# నాణ్యమైన విద్యను యువతకు అందించడమే లక్ష్యం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నాణ్యమైన విద్యను నేటితరం యువతకు అందించే దిశగా పనిచేస్తున్నామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. మంగళవారం ఏయూ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని వీసీ ఎగురవేసారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర్య సముపార్జనలో ప్రాణత్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి ఆకాంక్షించిన విధంగా రాష్ట్ర యువతను ఉన్నతంగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఉన్నత భవిష్యత్తుకు నేడు అందిస్తున్న నాణ్యమైన విద్య బాటగా నిలుస్తుందన్నారు. సామాజిక అసమానతలను రూపుమాపడం వలన స్వాతంత్ర్యానికి నిజమైన అర్థాన్ని ఇవ్వగలమన్నారు. సమిష్టిగా పనిచేస్తూ ఒక మార్గదర్శిగా ఏయూ నిలుస్తున్న విధానం వివరించారు. ఉత్తమ విలువలు మన దేశాన్ని అత్యున్నతంగా ప్రపంచ పటంలో నిలుపుతున్నాయని, వీటిని పరిరక్షిస్తూ ముందుకు తీసుకువెళ్లాలన్నారు.

ముందుగా ఏయూ పరిపాలనా భవనం వద్దనున్న మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాల వేసారు. అనంతరం మైదానంలో జెండా+6 ఎగురవేసి ఎన్‌సిసి విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. ఏయూ సంగీత విభాగం విద్యార్థులు దేశభక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు.

కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.శ్రీనివాస రావు, జి.శశిభూషణ రావు, ఏ.నరసింహా రావు, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, వై.రాజేంద ప్రసాద్, డీన్‌లు ఆచార్య ఎన్.విజయ్ మోహన్, టి.షారోన్ రాజు, ఎన్.ఏ.డి పాల్, ఏ.పల్లవి, అధికారులు, ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

Sugar Free Fitearly | నడివయస్కులకు దివ్య శక్తి ఫిట్ ఎర్లీ | थकावट से सत्वर उपसमन फिट एर्ली

వివిధ వృత్తి, ఉద్యోగాలలో అలసటకు లోనై నీరసించి పోతున్నారా?

మందులు మింగలేక, చక్కెరతో కూడిన ఎనర్జీ బూస్టర్లు సేవించలేకపోతున్నారా?

దిగులు చెందకండి.

"ఫిట్ ఎర్లీ" మిమ్మల్ని నిరంతరం శక్తివంతం గాను, ఉత్సాహవంతంగాను ఉంచుతుంది.

సోయప్రోటీన్, వే ప్రోటీన్, బ్రాహ్మి, హరితకి, సీ భక్తారన్, శొంఠి, తులసి, అశ్వగంధ

తదితర హిమాలయముల నుండి సేకరించిన విశిష్ట వన మూలిక సమ్మిళితమైన "ఫిట్ ఎర్లీ" విశిష్టానుభవం గల పరిశోధకులచే రూపొందించబడింది. అంతేకాక ప్రఖ్యాత వైద్యరంగ పరిశోధన శాలలో అన్ని విధములుగా పరీక్షించబడి సంతృప్తి కంమైన ఫలితాలను ప్రకటించుకోబడిన ఉపాహారం



ఆంధ్రప్రదేశ్‌లో డీలర్‌షిప్ వివరాలకు సంప్రదించండి

ఎస్.వీరభద్రరావు : సెల్: 8247526179

ఈ-మెయిల్: surampudi43@gmail.com

HERBINDO LABS PRIVATE LIMITED ® HEALTH AND HAPPINESS

Compli

HERBINDO LABS PVT LTD.
2-2-642/1/1/1A, Sadguru Krupa,
Street No 16,
Amberpet, Hyderabad - 500013,
Telangana, India
E-Mail: herbindolabs@gmail.com
Mob: +91 9704885252
GSTN: 36AAECH6684G1ZA
CIN: U24100TG2018PTC127052

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921, Pardwada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8885687610, VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776